www.prajanaava.in

Telugu Daily

ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00



బంగారం, వెండి ధరలు పతనం

7

Published from: **Hyderabad, Rangareddy, Karimnagar** Circulated to: **Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad**

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 80 | శనివారం | 31 అక్టోబర్, 2026



ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం సమీపంలో వరద నీటిలో చిక్కుకున్న వాహనాలు. 'అర్నబ్' తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు జాతీయ రహదారి–16పైకి వరద నీరు చేరడంతో వందలాది మంది ప్రయాణికులు చిక్కుకుపోయారు. ఒడిశాలోని బహులాటి ఆనకట్ట నుంచి నీటి విడుదలతో వరద ఉధృతి పెరిగింది.

రైతులను పట్టించుకోని సీఎం
పదవిలో ఉండొద్దు

- అన్నదాతల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం ప్రజలకు ఏం న్యాయం చేస్తుంది?
- తుమ్మిడిహట్టి పూర్తిచేస్తే 2.5 లక్షల ఎకరాలకు సాగునీరు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనలో ఆదిలాబాద్‌కు తీరని అన్యాయం
- ఇంద్రవెల్లి పాంచజన్య సంకల్ప సభలో టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత

2



రైతులను పంటలు వేయవద్దని చెప్పే ముఖ్యమంత్రి పదవిలో ఉండకూడదని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న రైతులకు పంటలు వేయొద్దంటే వారిని ఎలా ఆదుకుంటారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. రైతుల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం ప్రజలకు ఏం న్యాయం చేస్తుందని నిలదీశారు. ఉమ్మడి జిల్లాల్లో పాంచజన్య సంకల్ప సభల నిర్వహణలో భాగంగా శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో జరిగిన సభలో ఆమె మాట్లాడారు.

చివరి శ్వాస వరకు
ప్రజాసేవలోనే..

- అన్నదాతలే దేశానికి బలమైన మూలస్తంభాలు
- రైతులపై ఎరువుల ధరల భారం పడకుండా కేంద్రం భరించింది: ప్రధాని నరేంద్ర మోడీ
- భారత్ బోవైన్ బ్రీడింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్‌ను ప్రారంభం
- రైతుల ఖాతాల్లోకి పీఎం–కిసాన్ నిధులు.. 24వ విడతగా రూ.19 వేల కోట్లు విడుదల



2

దేశానికి అన్నదాతలే అత్యంత బలమైన మూలస్తంభాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. తన జీవితంలో చివరి శ్వాస వరకు ప్రజాసేవలోనే నిమగ్నమై ఉంటానని స్పష్టం చేశారు. శుక్రవారం గుజరాత్‌లోని బనాస్కాంత జిల్లాలో పర్యటించిన ఆయన.. 'భారత్ బోవైన్ బ్రీడింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్'ను ప్రారంభించారు. దాదాపు రూ.14 వేల కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం నిర్వహించిన భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన తనకు తొలుత గుజరాత్‌కు, ఆ తర్వాత దేశానికి సేవ చేసే గొప్ప అవకాశాన్ని ప్రజలు కల్పించారని మోడీ గుర్తుచేసుకున్నారు.

న్యాయపోరాటంతో
భూములను కాపాడాం

మూడేళ్లలో రూ.1.50 లక్షల కోట్ల ప్రభుత్వ భూముల పరిరక్షణ

మియాపూర్ భూములను ప్రైవేటు పరం చేసేందుకు కేసీఆర్ కుట్రలు

- రూ.50వేల కోట్ల భూములపై కేసీఆర్ కన్ను
- మియాపూర్ భూములను ప్రైవేటు పరం చేసేందుకు కుట్రలు
- భూముల స్వాధీనానికి రెండు రోజుల్లో చర్యలు
- వేలం ద్వారా వచ్చే నిధులు విద్యాభివృద్ధికి వినియోగం
- కేసీఆర్ ఫాంహౌస్ భూములపై సర్వే.. అక్కడే శ్రీకాంతాచారి అమరవీరుల కాలనీ
- కేటీఆర్ కన్నేసిన మంచిరేవులలో 143 ఎకరాలు రక్షించాం
- హరీశ్ మామ భూముల సర్వేకు కావాలనే అడ్డంకులు
- డిసెంబర్ 9 నాటికి జర్నలిస్టులకు ఫ్యూచర్ సిటీలో ఇళ్ల స్థలాలు
- ఢిల్లీలో మీడియాతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ప్రజానావ, హైదరాబాద్: మియాపూర్‌లో రూ.50 వేల కోట్ల విలువైన 550 ఎకరాల ప్రభుత్వ భూములను కాపాడామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ భూములపై ప్రైవేటు వ్యక్తులు దాఖలు చేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేయడం ప్రభుత్వానికి లభించిన విజయమని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలు ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో రూ.1.50 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కబ్జాల నుంచి రక్షించిందని వెల్లడించారు. మియాపూర్ భూములను రెండు రోజుల్లో స్వాధీనం చేసుకునే ప్రక్రియ ప్రారంభిస్తామని, అవసరమైతే వేలం వేసి వచ్చే ఆదాయాన్ని విద్యాభివృద్ధికి ఖర్చు చేస్తామని తెలిపారు. శుక్రవారం ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన భూ ఆక్రమణలు, ప్రభుత్వ భూముల పరిరక్షణ, జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపుపై మాట్లాడారు. మియాపూర్‌లోని సర్వే నంబర్లు 100, 101 పరిధిలో ఉన్న 550 ఎకరాల ప్రభుత్వ భూములను గత ప్రభుత్వ హయాంలో ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు ప్రయత్నాలు జరిగాయని సీఎం ఆరోపించారు. రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి భూములను చేజిక్కించుకోవాలని చూశారని విమర్శించారు. ఈ వ్యవహారంలో గోల్డ్‌స్టోన్ ప్రసాదరావు కీలకంగా వ్యవహరించారని, అప్పటి సీఎం కేసీఆర్, ఆయన బంధువు దామోదరరావు తరువాయి 2లో..

మియాపూర్ భూముల పరిరక్షణ ఘనత
బీఆర్ఎస్‌దే



- సుప్రీంకోర్టులో ఎనిమిదేళ్లు న్యాయపోరాటం చేశాం
- సీఎం రేవంత్ వ్యాఖ్యలన్నీ అబద్ధాలే.. కోర్టు రికార్డులే సాక్ష్యం
- రూ.60వేల కోట్ల విలువైన భూములు అమ్మేందుకు కుట్ర
- బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు

2

జనవరి 25 నుంచి
దేశవ్యాప్తంగా జనగణన

- ఫిబ్రవరి 28 వరకు ప్రక్రియ కొనసాగింపు
- రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా నోటిఫికేషన్ జారీ

2

అధిక ధరలకు బియ్యం విక్రయిస్తే కఠిన చర్యలు

బీపీటీ ధరకు ప్రభుత్వం కళ్లెం

- అక్రమ నిల్వలు, బ్లాక్‌మార్కెటింగ్‌కు పాల్పడితే చర్యలు
- బియ్యం నిల్వలు సరిపడా ఉన్నాయి.. ప్రజలు ఆందోళన చెందొద్దు
- పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



2

సాన్నిహిత్యాన్ని అత్యాచారంగా
పరిగణించలేం

- ప్రేమ సంబంధాల్లో విభేదాలను క్రిమినల్ కేసులుగా మార్చే ధోరణిపై సుప్రీంకోర్టు ఆందోళన
- అత్యాచారం, మోసం ఆరోపణలను వేర్వేరుగా పరిశీలించాలన్న అత్యున్నత ధర్మాసనం



2

సాన్నిహిత్యాన్ని అత్యాచారంగా పరిగణించలేం: సుప్రీం

న్యూఢిల్లీ: పరస్పర అంగీకారంతో కొనసాగిన బంధంలో తర్వాత విభేదాలు తలెత్తినంత మాత్రాన, గతంలో ఉన్న సాన్నిహిత్యాన్ని అత్యాచారంగా పరిగణించలేమని సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సంబంధాలు విఫలమైన తర్వాత క్రిమినల్ కేసులు నమోదు చేసే ధోరణి పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. కేరళకు చెందిన ఓ వ్యక్తిపై నమోదైన అత్యాచారం, మోసం కేసు విచారణ సందర్భంగా జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఓ జంట మధ్య సంబంధం సజావుగా కొనసాగుతున్న సమయంలో పరస్పర సమ్మతితో ఏర్పడిన సాన్నిహిత్యాన్ని, ఆ బంధం విఫలమైన తర్వాత అత్యాచారంగా చిత్రీకరించలేమని ధర్మాసనం పేర్కొంది. పరస్పర అంగీకారంతో కొనసాగిన సంబంధాన్ని కేవలం తర్వాత వచ్చిన విభేదాల ఆధారంగా నేరంగా పరిగణించి, ఒక వ్యక్తి స్వేచ్ఛ, గౌరవానికి భంగం కలిగించేలా చర్యలు తీసుకోలేమని అభిప్రాయపడింది. అత్యాచారం, మోసం అనే రెండు ఆరోపణల మధ్య స్పష్టమైన తేడాను గుర్తించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు పేర్కొంది. విఫలమైన ప్రేమ సంబంధాలు లేదా వ్యక్తిగత బంధాలను క్రిమినల్ కేసులుగా మార్చే ధోరణి సాధారణమైపోతోందని వ్యాఖ్యానించింది.

వివాహ విషయాన్ని దాచాడంటూ ఫిర్యాదు

ఈ కేసులో బాధితురాలు చేసిన ఆరోపణల ప్రకారం.. అప్పటికే వివాహమైన విషయాన్ని దాచిపెట్టి నిందితుడు తనను రెండో వివాహం చేసుకున్నాడు. ఆ విషయం తెలిసిన తర్వాత అతడి నుంచి విడాకులు తీసుకున్నట్లు ఆమె తెలిపింది. తనను మోసం చేసి రెండో పెళ్లి చేసుకున్నాడని ఆరోపిస్తూ అత్యాచారం, మోసం, నమ్మకద్రోహం కింద కేసు నమోదు చేయించింది. ఈ కేసు విచారణ సందర్భంగా ధర్మాసనం పై వ్యాఖ్యలు చేసింది.

దయనీయ స్థితిలో ఐడీబీఐ అప్పగింత

- ఇప్పుడు ఫోన్ కాల్స్‌తో రుణాల ఒత్తిడి లేదు
- రాహుల్‌కు నిర్మలా సీతారామన్ కౌంటర్

న్యూఢిల్లీ: ఐడీబీఐ బ్యాంకులో ప్రభుత్వ, ఎల్ఐసీకి ఉన్న మెజారిటీ వాటాను కెనడాకు చెందిన ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్‌కు విక్రయించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం రాజకీయంగా వివాదానికి దారితీసింది. ఈ ప్రతిపాదనను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా వ్యతిరేకించగా, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆయనకు కౌంటర్ ఇచ్చారు. కాంగ్రెస్ పాలనలో రాజకీయ పలుకుబడి ఉన్న వ్యాపారవేత్తలకు నిబంధనలు పట్టించుకోకుండా రుణాలు ఇచ్చేందుకు ప్రభుత్వ రంగ బ్యాంకులపై ఒత్తిడి తెచ్చారని విమర్శించారు. ఐడీబీఐ బ్యాంకు అప్పట్లో మొండి బకాయిలతో తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని పేర్కొన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు ఐడీబీఐ బ్యాంకు పరిస్థితి దయనీయంగా ఉండేదని నిర్మలా సీతారామన్ తెలిపారు. మోదీ ప్రభుత్వం తీసుకున్న విధానపరమైన చర్యలతో బ్యాంకు మళ్లీ గాడిన పడిందని, రూ.25 వేల కోట్లకు పైగా మూలధనాన్ని సమీకరించి పునరుద్ధరించిందని వెల్లడించారు. ప్రస్తుతం బ్యాంకు వృద్ధి పథంలో పయనిస్తోందని పేర్కొన్నారు. బ్యాంకు పునర్వ్యవస్థీకరణలో అన్ని నియమ నిబంధనలను పాటించామని, కాంగ్రెస్ హయాంలో పలుకుబడి ఉన్నవారికి, సామాన్యులకు వేర్వేరు విధానాలు అమలయ్యేవని ఆమె ఆరోపించారు. ఆ పరిస్థితి ఇప్పుడు లేదని, సామాన్య ప్రజలకు రుణాలు సులభంగా అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. ఫోన్ కాల్స్ ద్వారా రుణాలు మంజూరు చేయాలంటూ బ్యాంకు ఉద్యోగులపై ఎలాంటి ఒత్తిడి లేదని సామాజిక మాధ్యమాల్లో సుదీర్ఘ పోస్టు పెట్టారు.

ఒమేగా ఆసుపత్రులపై ఐటీ దాడులు

- పన్ను ఎగవేత, అనధికార నగదు లావాదేవీలపై ఆరా
- కీలక పత్రాలు స్వాధీనం

ప్రజానావ, హైదరాబాద్: ప్రముఖ క్యాన్సర్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నెట్‌వర్క్ ఒమేగా హాస్పిటల్స్‌పై ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ అధికారులు శుక్రవారం సోదాలు నిర్వహించారు. తెలుగు రాష్ట్రాలతోపాటు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లోని మొత్తం 24 ప్రాంతాల్లో ఆసుపత్రుల శాఖలు, యాజమాన్యానికి సంబంధించిన నివాసాలు, కార్యాలయాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్ ఇన్వెస్టిగేషన్ వింగ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఈ సోదాల్లో పాల్గొన్నాయి. ఆసుపత్రుల అడ్మినిస్ట్రేటివ్ బ్లాకులు, ఫైనాన్స్ విభాగాలపై అధికారులు ప్రధానంగా దృష్టి సారించారు. పలువురు కీలక వైద్యులు, యాజమాన్య ప్రతినిధుల నివాసాల్లోనూ సోదాలు నిర్వహించారు. భారీగా పన్ను ఎగవేతకు పాల్పడినట్లు, అనధికార నగదు లావాదేవీలు జరిగినట్లు వచ్చిన సమాచారంతో ఈ తనిఖీలు చేపట్టారు. సోదాల్లో పలు కీలక పత్రాలు, బ్యాంకు లావాదేవీల రికార్డులు, డిజిటల్ హార్డ్‌డిస్క్‌లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం అకౌంట్స్ పుస్తకాలు, ఆసుపత్రుల బిల్లింగ్ సాఫ్ట్‌వేర్ డేటాను పరిశీలిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఏకకాలంలో తనిఖీలు జరగడంతో వైద్య రంగంలో చర్చనీయాంశంగా మారింది.

జనవరి 25 నుంచి దేశవ్యాప్తంగా జనగణన

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది జనవరి 25 నుంచి దేశవ్యాప్తంగా జనగణన ప్రక్రియ ప్రారంభం కానుంది. ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలు, మంచు తీవ్రత అధికంగా ఉండే ప్రాంతాలు మినహా మిగిలిన రాష్ట్రాల్లో ఫిబ్రవరి 28 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్, మణిపూర్, గోవా రాష్ట్రాలతో పాటు లద్దాఖ్, హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకశ్మీర్‌లోని మంచు ప్రభావిత ప్రాంతాల్లో ఈ విడతలో జనగణన నిర్వహించబోమని తెలిపింది. ఈ మేరకు రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా నోటిఫికేషన్ జారీ చేసింది. 2027 మార్చి 1వ తేదీని జనగణనకు రిఫరెన్స్ తేదీగా నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. వివరాల్లో మార్పులు, సవరణలు చేసుకునేందుకు మార్చి 1 నుంచి 5 వరకు అవకాశం కల్పించారు. ప్రజలు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునేందుకు జనవరి 10 నుంచి 24 వరకు గడువు ఇచ్చారు. ఆన్‌లైన్ లేదా నిర్దేశించిన విధానంలో స్వీయ గణన చేసుకోవచ్చు. అనంతరం జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజల వివరాలను సేకరిస్తారు.

న్యాయపోరాటంతో భూములను కాపాడాం

(మొదటిపేజీ తరువాయి)

ద్వారా భూములను పొందే ప్రయత్నం జరిగిందని ఆరోపించారు. దామోదరరావుకు ఖరీదైన కార్లు బహుమతిగా ఇచ్చారని, కేసీఆర్‌కు నగదు రూపంలో ముడుపులు అందాయని వ్యాఖ్యానించారు. మియాపూర్ భూములపై ప్రైవేటు వ్యక్తులు దాఖలు చేసిన పిటిషన్లను జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం కొట్టివేసిందని రేవంత్‌రెడ్డి తెలిపారు. రెవెన్యూ రికార్డులు, పహాణీల్లో పేర్లు నమోదైనంత మాత్రాన యాజమాన్య హక్కులు సంక్రమించవని న్యాయస్థానం స్పష్టం చేసిందన్నారు. ఈ తీర్పుతో ప్రభుత్వ భూములపై ప్రైవేటు వ్యక్తుల హక్కుల వాదనలకు అడ్డుకట్ట పడిందని పేర్కొన్నారు. తీర్పు వెలువడిన వెంటనే 550 ఎకరాలను స్వాధీనం చేసుకునేందుకు అధికారులను ఆదేశించామని, రెండు రోజుల్లో ప్రక్రియ ప్రారంభిస్తామని వెల్లడించారు. భూములను వేలం వేసి వచ్చే నిధులను విద్య, వైద్యం, నీటిపారుదల వంటి రంగాలకు వినియోగించే అంశాన్ని పరిశీలిస్తామని, దీనిపై మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

మంచిరేవులలో 143 ఎకరాలు కాపాడాం

ప్రభుత్వ భూముల పరిరక్షణకు పలు వివాదాస్పద భూములపై న్యాయపోరాటం చేశామని సీఎం వివరించారు. ఐఎంజీ భూముల విషయంలోనూ సుప్రీంకోర్టులో ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. మంచిరేవుల పరిధిలోని 143 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటీఆర్, రాయలసీమ బిల్డర్స్‌తో కలిసి ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. న్యాయపోరాటంతో ఆ భూములను కాపాడామని, అందులో 50 ఎకరాలను యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు కేటాయించామని తెలిపారు. కంచె గచ్చిబౌలి, మామిడిపల్లి భూములను కాజేసేందుకు బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నించగా అడ్డుకున్నామని చెప్పారు. గుర్రంగూడలో అటవీ భూముల ఆక్రమణలపై సుప్రీంకోర్టును ఆశ్రయించామని, ఆ భూములు అటవీ భూములేనని న్యాయస్థానం స్పష్టం చేసిందన్నారు. ఎల్బీనగర్ పరిధిలో 150 ఎకరాలను అటవీ ప్రాంతంగా మార్చినట్లు వివరించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 400 ఎకరాల అటవీ భూమిని బీఆర్ఎస్‌లోకి ఫిరాయించిన ఓ ఎమ్మెల్యేకు అప్పగించే ప్రయత్నం జరిగిందని ఆరోపించారు. ఈ వ్యవహారంలోనూ న్యాయపోరాటం చేసి భూములను కాపాడుకున్నామని తెలిపారు.

ఎర్రవల్లిలో సర్వే.. అమరవీరుల కాలనీ

శేరి వెంకటాపూర్, ఎర్రవల్లి గ్రామాల పరిధిలోని సర్వే నంబర్ 325లో ఉన్న 388 ఎకరాల ప్రభుత్వ భూముల విషయంలోనూ ఆక్రమణల ప్రయత్నాలు జరిగాయని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. భూములను సర్వే చేసేందుకు వెళ్లిన అధికారులను కొందరు అడ్డుకునేందుకు ప్రయత్నించారని తెలిపారు. ప్రస్తుతం ఎర్రవల్లిలో సర్వే కొనసాగుతోందని, భూములను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకునేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఆక్రమణలపై పూర్తిస్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెలికితీస్తామన్నారు. ఆ ప్రాంతంలో శ్రీకాంతాచారి అమరవీరుల కాలనీ నిర్మిస్తామని ప్రకటించారు.

హరీశ్ మామ భూములపై ఆరోపణలు

హరీశ్‌రావు మామ హనుమంతరావు ఆక్రమణలో ఉన్నాయని ఆరోపణలు ఎదుర్కొంటున్న భూములను సర్వే చేయకుండా అధికారులను అడ్డుకుంటున్నారని సీఎం విమర్శించారు. కోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారని ఆరోపించారు. భూ ఆక్రమణలపై అసెంబ్లీలో చర్చించేందుకు కేసీఆర్, హరీశ్‌రావు ముందుకు రావాలని సవాల్ విసిరారు. ఉమ్మడి రాష్ట్రంలో పద్మాలయ స్టూడియో, ల్యాంకో భూములపై కేసులు వేసిన కేసీఆర్, హరీశ్‌రావు అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని ఎందుకు స్వాధీనం చేసుకోలేదని ప్రశ్నించారు. గతంలో కేసులు వేసిన వారితోనే అధికారంలోకి వచ్చాక లాలూచీ పడ్డారని ఆరోపించారు. భూ ఆక్రమణలపై పోరాడినందుకే అప్పటి ప్రభుత్వం తనపై కక్షగట్టి జైలుకు పంపిందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణపై ఎక్కడా రాజీ పడబోమని స్పష్టం చేశారు.

జర్నలిస్టులకు ఫ్యూచర్ సిటీలో స్థలాలు

జర్నలిస్టులకు ఫ్యూచర్ సిటీలో ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. డిసెంబర్ 9 నాటికి కేటాయింపు ప్రక్రియను కొలిక్కి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఇందుకు అవసరమైన భూమిని గుర్తించి 15 రోజుల్లో లేఅవుట్ సిద్ధం చేయాలని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఫోన్ చేసి సూచించారు. మీడియా ప్రతినిధుల సమక్షంలోనే ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. స్థలాల కేటాయింపులో రాజకీయ, ఇతర ప్రభావాలకు తావులేకుండా పారదర్శక విధానం అమలు చేస్తామని తెలిపారు. అర్హులైన జర్నలిస్టులకు చిన్నపిల్లల చేతుల మీదుగా లక్కీడ్రా నిర్వహించి ప్లాట్లు కేటాయించే విధానాన్ని ప్రతిపాదించారు. అర్హతలకు సంబంధించిన వివరాలను వెంటనే అందించాలని జర్నలిస్టులకు సూచించారు. 15 రోజుల్లో లేఅవుట్ సిద్ధం చేసి, డిసెంబర్ 9 నాటికి స్థలాల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని వెల్లడించారు.

చివరి శ్వాస వరకు ప్రజాసేవలోనే..



గాంధీనగర్: దేశానికి అన్నదాతలే అత్యంత బలమైన మూల స్తంభాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. తన జీవితంలో చివరి శ్వాస వరకు ప్రజాసేవలోనే నిమగ్నమై ఉంటానని స్పష్టం చేశారు. శుక్రవారం గుజరాత్‌లోని బనాస్కాంత జిల్లాలో పర్యటించిన ఆయన.. 'భారత్ బోవైన్ బ్రీడింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్'ను ప్రారంభించారు. దాదాపు రూ.14 వేల కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం నిర్వహించిన భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన తనకు తొలుత గుజరాత్‌కు, ఆ తర్వాత దేశానికి సేవ చేసే గొప్ప అవకాశాన్ని ప్రజలు కల్పించారని మోదీ గుర్తు చేసుకున్నారు. తన కుటుంబంలో ఏ తరంలోనూ కనీసం పంచాయతీ సర్పంచ్‌గా కూడా ఎవరూ పనిచేయలేదని చెప్పారు. తాను సాధించిన ప్రతి విజయం, ప్రతి పురోగతికి దేశ ప్రజలే కారణమని పేర్కొన్నారు. ప్రజల రుణాన్ని ఎప్పటికీ తీర్చుకోలేనని, జీవితాంతం వారికి రుణపడి ఉంటానని తెలిపారు.

విపత్తుల వేళ దుష్ప్రచారం

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, అంతర్జాతీయంగా ప్రతికూల పరిస్థితులు నెలకొన్న సమయంలో కొందరు దేశం సంక్షోభంలో పడితే సంతోషించేలా వ్యవహరిస్తున్నారని మోదీ విమర్శించారు. ఇరాన్, గల్ఫ్ దేశాల మధ్య యుద్ధ పరిస్థితులు తలెత్తిన నేపథ్యంలో దేశంలో ఎరువుల కొరత ఏర్పడుతుందని, వంట గ్యాస్ సరఫరా నిలిచిపోతుందని ఉద్దేశపూర్వకంగా వదంతులు వ్యాప్తి చేశారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేయడమే లక్ష్యంగా ఈ తప్పుడు ప్రచారం సాగించారని మండిపడ్డారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఎరువుల ధరలు భారీగా పెరిగినా, ఆ భారం భారతీయ రైతులపై పడకుండా కేంద్ర ప్రభుత్వమే భరించిందని మోదీ స్పష్టం చేశారు. దేశంలో ఎక్కడా ఎరువులు, గ్యాస్ కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు. రైతులకు ఎరువులు దొరకవంటూ భయాందోళనలు సృష్టించారని, కృత్రిమంగా క్యూలైన్లు ఏర్పరిచి పరిస్థితిని గందరగోళంగా మార్చేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. గ్యాస్ సిలిండర్లు అందవంటూ మహిళలను భయపెట్టారని విమర్శించారు. దేశంలోని రైతులు, యువత, మహిళలు 'వికసిత భారత్' నిర్మాణ లక్ష్యంతో ముందుకు సాగుతుంటే.. కొందరికి అది నచ్చడం లేదని మోదీ వ్యాఖ్యానించారు. దేశంపై ఏదైనా ఆపద వచ్చినప్పుడు కొందరు ఆనందిస్తున్నారని, సంక్షోభ సమయంలో దేశమంతా ఐక్యంగా నిలవాల్సిన అవసరం ఉందని అన్నారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట

ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం–కిసాన్) పథకంలో భాగంగా 24వ విడత నిధులను ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం విడుదల చేశారు. ఈ విడతలో సుమారు రూ.19 వేల కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. దేశవ్యాప్తంగా 9.34 కోట్ల మంది రైతులు ఈ నిధులతో లబ్ధి పొందారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రధాని పునరుద్ఘాటించారు. చిన్న, సన్నకారు రైతులకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు 'పీఎం–కిసాన్ సమ్మాన్ నిధి' పథకం ద్వారా ఇప్పటివరకు రూ.4.5 లక్షల కోట్లను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించడం, పశుసంవర్ధక రంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊతమిస్తున్నామని తెలిపారు. బనాస్కాంత జిల్లా వ్యవసాయ, సహకార రంగాల్లో సాధించిన ప్రగతిని మోదీ ప్రత్యేకంగా ప్రశంసించారు. అక్కడి రైతుల శ్రమ, పట్టుదల దేశానికే ఆదర్శమని అన్నారు. ఈ ప్రాంతంలో పండే బంగాళాదుంపలకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని పేర్కొన్నారు. బంగాళాదుంపల నుంచి బంగారం తయారు చేస్తామని చెప్పే ధైర్యం ఎవరూ చేయలేరని వ్యాఖ్యానించారు. ఎందుకంటే, తమ కష్టంతో బంగాళాదుంపల సాగు ద్వారా బంగారం లాంటి దిగుబడులు ఎలా సాధించాలో బనాస్కాంత రైతులకు బాగా తెలుసని కొనియాడారు.

వితంతువులకు తక్షణ పింఛన్

- మరో ఆరు కేటగిరీలకు వర్తింపు
- భర్త మరణించిన 15 రోజుల్లోనే మంజూరు
- వికలాంగులు, గీత, చేనేత కార్మికుల భార్యలకు కూడా లబ్ధి
- జీవో 566 జారీ చేసిన ప్రభుత్వం

ప్రజానావ, హైదరాబాద్: చేయూత సామాజిక భద్రతా పింఛను పథకంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. ఇప్పటివరకు వృద్ధాప్య పింఛను పొందుతున్న పురుష లబ్ధిదారుల భార్యలకే అందుబాటులో ఉన్న తక్షణ జీవిత భాగస్వామి పింఛను (ఇన్‌స్టంట్ స్పౌజ్ పెన్షన్) సదుపాయాన్ని మరో ఆరు కేటగిరీలకు విస్తరించింది. వికలాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, డయాలసిస్, ఏఆర్టీ, ఫైలేరియా పింఛనుదారుల భార్యలకూ ఈ సదుపాయం వర్తింపజేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దానకిశోర్ జీవో 566 విడుదల చేశారు. సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ(సెర్ప్) చేసిన ప్రతిపాదనల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఆయా కేటగిరీల్లో పింఛను పొందుతున్న పురుష లబ్ధిదారుడు మరణిస్తే, ఆయన భార్యకు వితంతు లేదా వృద్ధాప్య పింఛను మంజూరు చేస్తారు. భర్తను కోల్పోయిన మహిళలకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా సామాజిక భద్రత కల్పించడమే ఈ నిర్ణయం ఉద్దేశమని ప్రభుత్వం పేర్కొంది. పింఛను మంజూరులో భార్య వయసును ప్రాతిపదికగా తీసుకుంటారు. మరణించిన లబ్ధిదారుడి భార్య వయసు 57 ఏళ్లలోపు ఉంటే వితంతు పింఛను, 57 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ ఉంటే వృద్ధాప్య పింఛను మంజూరు చేస్తారు. అర్హులైన మహిళలు ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ మొదటి పేజీ, మరణించిన భర్త ఆధార్ కార్డు, మరణ ధ్రువీకరణ పత్రంతో దరఖాస్తు చేసుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శికి, పట్టణ ప్రాంతాల్లో బిల్ కలెక్టర్ లేదా సంబంధిత వార్డు అధికారికి దరఖాస్తు సమర్పించాలి. దరఖాస్తు అందిన 15 రోజుల్లోగా అధికారులు వివరాలను పరిశీలించి చేయూత పోర్టల్‌లో నమోదు చేయాలి. అనంతరం ఎంపీడీవో లేదా మున్సిపల్ కమిషనర్ ద్వారా డీఆర్డీవో లేదా జిల్లా కలెక్టర్ ఆమోదం పొందిన తర్వాతి నెల నుంచి పింఛను సొమ్ము విడుదల చేస్తారు. ఈ పింఛను మంజూరు ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. అర్హులైన మహిళలు ప్రత్యేక దరఖాస్తు గడువు కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేదని తెలిపింది. తాజా నిర్ణయంతో ఇప్పటివరకు ఈ సదుపాయం పరిధిలో లేని మరో ఆరు కేటగిరీల మహిళలకు సామాజిక భద్రత లభించనుంది.

అధిక ధరలకు బియ్యం విక్రయిస్తే కఠినచర్యలు

- బీపీటీ ధరకు ప్రభుత్వం కళ్లెం
- అక్రమ నిల్వలు, బ్లాక్‌మార్కెటింగ్‌కు చట్టపరమైన చర్యలు
- బియ్యం నిల్వలు సరిపడా ఉన్నాయి.. ప్రజలు ఆందోళన చెందొద్దు
- పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

ప్రజానావ, హైదరాబాద్: 'బియ్యం ధరల పెరుగుదలకు అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. అక్రమ నిల్వలు, బ్లాక్‌మార్కెటింగ్, అధిక ధరలకు విక్రయించే మిల్లర్లు, వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని అధిక లాభాలు ఆర్జిస్తూ వారిపై భారం మోపితే ఉపేక్షించేది లేదు' అని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. ప్రజలు ఎక్కువగా వినియోగించే బీపీటీ బియ్యం ధర కిలో రూ.66 మించకుండా నియంత్రణ చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే అక్రమాలకు సంబంధించి 12 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. బియ్యం ధరల నియంత్రణ, అక్రమ నిల్వల నిరోధానికి చేపట్టిన చర్యలపై శుక్రవారం బేగంపేట కుందన్‌బాగ్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. టోకు, చిల్లర వ్యాపారులు, రైస్‌మిల్లర్లతో అధికారులు జరిపిన చర్చల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తనిఖీల పురోగతి, అక్రమాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర వివరించారు. బియ్యం ధరలను కృత్రిమంగా పెంచడం, అక్రమ నిల్వలు, బ్లాక్‌మార్కెటింగ్‌ను అరికట్టేందుకు ఐదు శాఖల సమన్వయంతో ప్రత్యేక తనిఖీ బృందాలు రంగంలోకి దిగినట్లు మంత్రి ఉత్తమ్ తెలిపారు. పౌర సరఫరాలు, పోలీసు, జీఎస్టీ, తూనికలు – కొలతల శాఖలతోపాటు సంబంధిత ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయని చెప్పారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లోని బియ్యం మార్కెట్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు. బేగంబజార్, నాంపల్లి, మహరాజ్‌గంజ్ వంటి ప్రధాన వ్యాపార కేంద్రాల్లో విస్తృత తనిఖీలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. బీపీటీ బియ్యం ధర కిలో రూ.66కు మించకుండా చర్యలు తీసుకుంటున్నామని, ఆర్ఎన్ఆర్ బియ్యం ధరల విషయంలో నాణ్యత, ఉత్పత్తి వ్యయాల్లోని వ్యత్యాసాలను పరిగణనలోకి తీసుకొని సమీక్షిస్తామని తెలిపారు.

మార్కెట్‌లో ధరలు స్థిరపడే వరకు తనిఖీలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం వ్యాపారం చేసే వారితో చర్చలు జరుపుతామని, ఉల్లంఘనలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలో ప్రజల అవసరాలకు సరిపడా బియ్యం నిల్వలు ఉన్నాయని మంత్రి భరోసా ఇచ్చారు. కొరత ఏర్పడుతుందనే ఆందోళనతో అవసరానికి మించి బియ్యం కొనుగోలు చేసి నిల్వ చేసుకోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగా పంపిణీ చేస్తున్న సన్నబియ్యాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తెలంగాణ రైతులు పండించిన ధాన్యాన్ని రాష్ట్రంలోని మిల్లుల్లోనే బియ్యంగా మార్చి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందిస్తున్నామని వివరించారు.

రైతులను పట్టించుకోని సీఎం పదవిలో ఉండొద్దు



ప్రజానావ, ఆదిలాబాద్: రైతులను పంటలు వేయవద్దని చెప్పే ముఖ్యమంత్రి పదవిలో ఉండకూడదని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న రైతులకు పంటలు వేయొద్దంటే వారిని ఎలా ఆదుకుంటారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. రైతుల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం ప్రజలకు ఏం న్యాయం చేస్తుందని నిలదీశారు. ఉమ్మడి జిల్లాల్లో పాంచజన్య సంకల్ప సభల నిర్వహణలో భాగంగా శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో జరిగిన సభలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు ఆదిలాబాద్ జిల్లాను నిర్లక్ష్యం చేశాయని కవిత విమర్శించారు. తెలంగాణ ఏర్పడి 12 ఏళ్లు గడిచినా జిల్లాలో ఆశించిన అభివృద్ధి జరగలేదని, 750 గ్రామాల్లో కనీసం పాఠశాలలు కూడా లేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాకు నెలకు రెండుసార్లు వస్తానని చెప్పిన రేవంత్‌రెడ్డి మూడేళ్లలో రెండుసార్లే వచ్చారని విమర్శించారు. ఇంద్రవెల్లి అమరవీరులకు రూ.25 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక రూ.5 లక్షలే ఇచ్చారని ఆరోపించారు.

తుమ్మిడిహట్టిపై తేల్చాలి

తుమ్మిడిహట్టి ప్రాజెక్టును పూర్తిచేసి ఉంటే రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని కవిత అన్నారు. ఏళ్లుగా ప్రాజెక్టు పేరుతో ప్రజలను మభ్యపెట్టడం తప్ప కాంగ్రెస్, బీఆర్ఎస్ చేసిందేమీ లేదని విమర్శించారు. మహారాష్ట్రతో ఉన్న ఒప్పందం ప్రకారం 148 మీటర్ల నీటిని నిల్వ చేసుకుంటూ, 152 మీటర్ల ఎత్తులో ప్రాజెక్టు నిర్మాణంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. చనాఖా–కొరాటా ప్రాజెక్టు వ్యయాన్ని రూ.368 కోట్ల నుంచి రూ.2,100 కోట్లకు పెంచడంపై అవినీతి ఆరోపణలు చేస్తూ, దీనిపై బాధ్యులు సమాధానం చెప్పాలని కోరారు.

ఆదివాసీలకు న్యాయం ఏదీ?

ఇంద్రవెల్లి ఘటనకు కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని కవిత అన్నారు. ఆదివాసీల సమస్యలను పాలకులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఐటీడీఏ పరిధిలో జీవో 57తో పాటు 27 జీవోలను తిరిగి అమలు చేయాలని, 1972లో ఆస్తులు కొనుగోలు చేసిన ఆదివాసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రక్తహీనతతో బాధపడుతున్న ఆదివాసీ మహిళలకు పోషకాహారం అందించడంలోనూ నిర్లక్ష్యం జరుగుతోందన్నారు.

కేటీఆర్ సమాధానం చెప్పాలి

పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఆదిలాబాద్ జిల్లాకు సాగునీరు, విశ్వవిద్యాలయం, ఇంజినీరింగ్ కళాశాల ఎందుకు తీసుకురాలేదని కవిత ప్రశ్నించారు. పత్తి అధికంగా పండే జిల్లాలో టెక్స్‌టైల్ పార్కు ఎందుకు ఏర్పాటు చేయలేదని, సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, బోధన్ చక్కెర కర్మాగారాలను ఎందుకు పునరుద్ధరించలేదని కేటీఆర్‌ను నిలదీశారు. ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పిన తర్వాతే రైతు గర్జన సభ నిర్వహించాలని అన్నారు.

యువతకు రుణాలు.. బీసీలకు అవకాశాలు

సామాజిక తెలంగాణ సాధనే తమ లక్ష్యమని కవిత తెలిపారు. బీసీలు, యువతకు రాజకీయ అవకాశాలు కల్పిస్తూ సామాజిక న్యాయాన్ని ఆచరణలో చూపిస్తామన్నారు. ప్రైవేటు రంగంలోనూ మెరుగైన ఉచిత విద్య, వైద్యం అందిస్తామని, యువత వ్యాపారాలు ప్రారంభించేందుకు రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు రుణాలు అందిస్తామని ప్రకటించారు. రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించి, వారికి గౌరవం దక్కేలా చర్యలు తీసుకుంటామన్నారు. సభకు ముందు ముత్నూర్‌లో కొమురం భీమ్ విగ్రహానికి, ఇంద్రవెల్లి అమరవీరుల స్థూపానికి కవిత నివాళులర్పించారు. అనంతరం సభా ప్రాంగణానికి చేరుకున్నారు. సభకు ఆదివాసీలు, జిల్లా ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.


మియాపూర్ భూముల పరిరక్షణ ఘనత బీఆర్ఎస్‌దే

- మాజీ మంత్రి హరీశ్‌రావు

ప్రజానావ, హైదరాబాద్: మియాపూర్‌లోని 550 ఎకరాల విలువైన ప్రభుత్వ భూములను సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేసి కాపాడింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు అన్నారు. ఆ భూములను విక్రయిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడం సిగ్గుచేటని విమర్శించారు. మియాపూర్ భూ వివాదంపై సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన తర్వాత సీఎం మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలకు కోర్టు రికార్డులు భిన్నంగా ఉన్నాయని ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. మియాపూర్ భూవివాదం 2003లోనే స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) రూపంలో సుప్రీంకోర్టుకు చేరిందని, 2013లో సివిల్ అప్పీల్‌గా మారిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న విలువైన భూములు చేజారకుండా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని తెలిపారు. 2015లో సీనియర్ న్యాయవాది సీ.ఎస్. వైద్యనాథన్‌ను రాష్ట్ర ప్రభుత్వం తరఫున నియమించిందన్నారు. 2015 ఏప్రిల్ 7 నుంచి ఆయన సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించారని పేర్కొన్నారు. 2015 నుంచి 2023 వరకు దాదాపు ఎనిమిదేళ్ల పాటు బీఆర్ఎస్ ప్రభుత్వం భూముల పరిరక్షణ కోసం న్యాయపోరాటం చేసిందని హరీశ్‌రావు తెలిపారు. ప్రతి పిటిషన్, అఫిడవిట్, సంబంధిత ఆధారాలను సుప్రీంకోర్టు ముందు ఉంచింది నాటి ప్రభుత్వమేనని చెప్పారు.

ట్రినిటీ కేసు తీర్పే కీలకం

మియాపూర్ భూముల కేసులో సుప్రీంకోర్టు ప్రస్తావించిన చట్టపరమైన అంశాలను హరీశ్‌రావు తన ట్వీట్‌లో ఉటంకించారు. ఆంధ్రప్రదేశ్ జాగీర్దారీ రద్దు నిబంధనలు, అతియత్ విచారణల చట్టంలోని నిబంధనలతో పాటు 'ట్రినిటీ ఇన్‌ఫ్రావెంచర్స్ లిమిటెడ్ వర్సెస్ ఎం.ఎస్. మూర్తి' కేసులో 2023లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ప్రస్తావించారని వివరించారు. గోల్డ్‌స్టోన్ ప్రసాద్‌కు సంబంధించిన ట్రినిటీ ఇన్‌ఫ్రావెంచర్స్ కేసులో 2023 జూన్ 15న తెలంగాణ ప్రభుత్వం విజయం సాధించిందని, అప్పటికి రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలో ఉందని గుర్తుచేశారు. ఆ కేసులోనూ వైద్యనాథన్ ప్రభుత్వ తరఫున వాదించారని తెలిపారు. ఆ తీర్పులోని చట్టపరమైన అంశాలే మియాపూర్ భూముల తుది తీర్పునకు బలమైన ఆధారాలయ్యాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. సుప్రీంకోర్టు రికార్డులు బహిరంగంగా అందుబాటులో ఉన్నప్పటికీ, మియాపూర్ భూముల పరిరక్షణలో తానే కీలక పాత్ర పోషించినట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రచారం చేసుకుంటున్నారని హరీశ్‌రావు విమర్శించారు.



పట్టభద్రులంతా ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

లింగోజిగూడలో ఓటరు నమోదు కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పిలుపు

ప్రజానావ, ఎల్బీనగర్: హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియలో అర్హులైన పట్టభద్రులంతా తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పిలుపునిచ్చారు. లింగోజిగూడ డివిజన్ పరిధిలోని పోస్టాఫీస్ వద్ద నిర్వహించిన ఓటరు నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా నమోదు ప్రక్రియపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి, సీనియర్ నాయకులు తిలక్‌రావు, రాకేష్ ఠాగూర్, గంగపుత్ర భాస్కర్, నర్సింహా గుప్తా, జగన్నాథ్‌రెడ్డి, తోట రాజశేఖరరెడ్డి, దయానంద్, పార్థసారథి శ్రీధర్, శ్రీకాంత్, కుమార్, చిత్రం సాయి, ఆనంద్, ప్రసాద్, ప్రకాష్, వెంకట్‌రెడ్డి, ఉమామహేశ్వర్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

రేపు యాదాద్రి భువనగిరి జిల్లాలో గవర్నర్ పర్యటన

- **యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దర్శనం**
- **జనార్దనానంద సరస్వతి 26వ వేద విద్వత్ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరు**

ప్రజానావ, యాదాద్రి భువనగిరి : తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా రేపు యాదాద్రి భువనగిరి జిల్లాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకోవడంతో పాటు, జనార్దనానంద సరస్వతి 26వ వేద విద్వత్ మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొన నున్నారు. గవర్నర్ పర్యటనకు సంబంధించి అధికారిక షెడ్యూల్ విడుదలైంది. ఉదయం 10.30 గంటలకు యాదగిరిగుట్టలోని వీఐపీ అతిథి గృహా నికి చేరుకుంటారు. అనంతరం 10.40 నుంచి 10.55 గంటల వరకు ఆలయంలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అక్కడి నుంచి కళ్యాణకట్ట సమీపంలోని పాత అన్నదాన భవనానికి చేరుకుని ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న జనార్దనానంద సరస్వతి 26వ వేద విద్వత్ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఈ సందర్భంగా వేద పండితులు, ఆధ్యాత్మిక ప్రముఖులతో సమావేశంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 12.10 నుంచి 12.50 గంటల వరకు ఆలయ వీఐపీ అతిథి గృహంలో విశ్రాంతి తీసుకుంటారు. మధ్యాహ్నం 12.50 గంటలకు యాదగిరిగుట్ట నుంచి హైదరాబాద్ కు తిరుగు ప్రయాణమవుతారు. మధ్యాహ్నం 2.10 గంటలకు లోక్‌భవన్‌కు చేరుకుంటారు. గవర్నర్ పర్యటన నేపథ్యంలో సంబంధిత అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేపట్టనున్నారు.

ప్రతి ఇంటా ఇంకుడు గుంత తప్పనిసరి

నీటి సంరక్షణపై నార్త్ సిటీ పాఠశాల విద్యార్థుల అవగాహన ర్యాలీ

ప్రజానావ, కుత్బుల్లాపూర్: భూగర్భ జలాలు అడుగంటకుండా వర్షపు నీటిని ఒడిసిపట్టాలని, ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత ఏర్పాటు తప్పనిసరి చేయాలని నార్త్ సిటీ పాఠశాల విద్యార్థులు పిలుపునిచ్చారు. నీటి వృథాను అరికట్టాలనే నినాదంతో సూరారం ఎక్స్ రోడ్డు వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు నీటి పొదుపుపై నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంట్లో కుళాయిల ద్వారా నీరు వృథాగా పోకుండా చూడాలని, స్నానం సహా రోజువారీ అవసరాలకు పరిమితంగా నీటిని వినియోగించాలని సూచించారు. వృథాగా పోతున్న నీటిని సాధ్యమైనంతవరకు ఇతర అవసరాలకు మళ్లించాలని కోరారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకించేలా ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని, వీటిని బోరు అనుమతులు, బ్యాంకు రుణాలు, ప్లాట్లు, ఇళ్ల రిజిస్ట్రేషన్లతో అనుసంధానిస్తూ నిబంధనలు తీసుకురావాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. బోర్లు వేసే సమయంలో నీరు వృథాగా బయటకు ప్రవహించకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. నీరు లేనిదే జీవనం సాధ్యం కాదని, ప్రస్తుత నిర్లక్ష్యం భవిష్యత్తు తరాలకు తీవ్ర నీటి సంక్షోభాన్ని మిగులుస్తుందని రవీందర్ ముదిరాజ్ పేర్కొన్నారు. ప్రతి వర్షపు బొట్టును ఒడిసిపట్టడం, నీటిని పొదుపుగా వినియోగించడం ప్రతి ఒక్కరి దైనందిన అలవాటుగా మారాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు నీటిని సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీఎంసీ అధికారులు, పాఠశాల డ్రైవర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నవభారత్ నగర్‌లో హైడ్రా కూల్చివేతలు

- **బాధితులకు మద్దతుగా వెళ్లిన బీఆర్ఎస్ నేతల అరెస్టు**
- **సామాన్లు తీసుకోకముందే ఇళ్లు నేలమట్టం చేశారని బాధితుల ఆవేదన**



ప్రజానావ, మాదాపూర్: హైదరాబాద్‌లోని మాదాపూర్ పరిధి నవభారత్ నగర్‌లో హైడ్రా అధికారులు చేపట్టిన కూల్చివేతలు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. అధికారులు ముమ్మరంగా కూల్చివేతలు చేపట్టడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు బాధితులకు మద్దతుగా వెంటనే కాలనీకి చేరుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు రంగప్రవేశం చేసి బీఆర్ఎస్ నాయకుడు కార్తీక్ రాయల్‌తో పాటు పలువురు నేతలను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. మరోవైపు ఇళ్ల కూల్చివేతలతో బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఇళ్లలోని నిత్యావసర వస్తువులు, ఇతర సామాన్లు బయటకు తీసుకునే అవకాశం కూడా ఇవ్వకుండా జేసీబీలతో ఇళ్లను నేలమట్టం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా, నోటీసులు జారీ చేయకుండా అకస్మాత్తుగా కూల్చివేతలు చేపట్టడంపై బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని, అధికారులను నిలదీశారు. బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.







ప్రకృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- **అభివృద్ధితో పాటు పచ్చదనం, పర్యావరణ సమతుల్యతకు ప్రాధాన్యమివ్వాలి**
- **పీవీ నరసింహారావు దూరదృష్టి, సంస్కరణలు దేశ ప్రగతికి పునాది 'ఘనం**
- **పి.వి. వనం' పుస్తకావిష్కరణలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా**

ప్రజానావ, హైదరాబాద్ : ప్రకృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పచ్చదనం, పర్యావరణ సమతుల్యతకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు. ఔషధ మొక్కల విశిష్టత, వృక్ష సంపద ప్రాధాన్యత, ప్రకృతి పరిరక్షణ ఆవశ్యకతను ప్రజలకు తెలియజేసే లక్ష్యంతో రూపొందించిన 'ఘనం – పి.వి. వనం' పుస్తకాన్ని శుక్రవారం బేగంపేటలోని స్వామి రామానంద తీర్థ మెమోరియల్ ప్రాంగణంలో ఆయన ఆవిష్కరించారు. సురభి ఎడ్యుకేషనల్ సొసైటీ, స్వామి రామానంద తీర్థ మెమోరియల్ కమిటీ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భారతరత్న, మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు ఘనంగా నివాళులర్పించారు. పుస్తక రచయిత్రి, ఎమ్మెల్సీ సురభి వాణీదేవిని అభినందించిన గవర్నర్ మాట్లాడుతూ.. ఔషధ మొక్కలు, వృక్ష సంపదలోని ఔషధ గుణాలు, వాటి ఉపయోగాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు 'ఘనం – పి.వి. వనం' పుస్తకం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. మన చుట్టూ అందుబాటులో ఉన్న ప్రకృతి సంపద విలువను ప్రతి ఒక్కరూ గుర్తించాలని సూచించారు. తులసి వంటి మొక్కల ఔషధ ప్రాధాన్యతను, నిమ్మకాయ వంటి సహజ పదార్థాల రోజువారీ ఉపయోగాలను ప్రస్తావిస్తూ ప్రకృతి ప్రసాదించిన వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పది మంది కుమారులను పొందినంత పుణ్యం ఒక చెట్టును కాపాడటంలో ఉందనే నానుడిని గుర్తుచేస్తూ.. మానవ మనుగడకు చెట్లు ఎంతటి కీలకమో వివరించారు. చెట్లు కేవలం పర్యావరణానికి మాత్రమే కాకుండా జీవవైవిధ్య పరిరక్షణకు, భవిష్యత్ తరాల మనుగడకు కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. అభివృద్ధి పేరుతో విచ్చలవిడిగా చెట్లను తొలగించడం సరికాదని, తప్పనిసరి పరిస్థితుల్లో చెట్లను తొలగించాల్సి వస్తే వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటి, అవి పెరిగే వరకు బాధ్యతగా సంరక్షించాలని సూచించారు. పచ్చదనాన్ని పెంపొందించడం, సహజ వనరులను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యతగా గుర్తించాలని పిలుపునిచ్చారు. ఇదే సందర్భంలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు దేశానికి అందించిన సేవలను గవర్నర్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రధానిగా ఆయన హయాంలో ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు, ప్రపంచీకరణ విధానాలు భారతదేశ అభివృద్ధికి కొత్త దిశానిర్దేశం చేశాయని కొనియాడారు. అంతర్జాతీయ మార్కెట్లతో భారత్ అనుసంధానం కావడంతో పాటు పారిశ్రామిక, సాంకేతిక, వాణిజ్య రంగాల పురోగతికి ఆ సంస్కరణలు పునాదులు వేశాయని తెలిపారు. ముఖ్యంగా సమాచార సాంకేతిక, దూరసంప్రేషణ రంగాల్లో దేశం సాధించిన అభివృద్ధిపై పీవీ దూరదృష్టి, సమయోచిత నిర్ణయాలు, దేశానికి అందించిన సేవలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. అనంతరం పుస్తక రచయిత్రి, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి మాట్లాడుతూ.. ప్రకృతి భగవంతుడు మానవాళికి ప్రసాదించిన అపురూపమైన వరమని అన్నారు. అభివృద్ధి పేరుతో చెట్లను నరికివేయడం, పర్యావరణాన్ని కలుషితం చేయడం వల్ల సహజ సమతుల్యత దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతిని కాపాడుకోవడం, పర్యావరణ సమతుల్యతను పరిరక్షించడం ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించాలని సూచించారు. ఔషధ మొక్కల ప్రాధాన్యతను, ప్రకృతి పరిరక్షణ ఆవశ్యకతను భవిష్యత్ తరాలకు తెలియజేయడమే పుస్తక రచన వెనుక ప్రధాన ఉద్దేశమని వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ శాసనమండలి ఉపాధ్యక్షుడు డాక్టర్ బండ ప్రకాశ్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, స్వామి రామానంద తీర్థ మెమోరియల్ కమిటీ అధ్యక్షుడు పి.వి. ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

బ్లాక్ స్పాట్ల గుర్తింపు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి : ఎస్పీ పరితోష్ పంకజ్

ప్రజానావ, సంగారెడ్డి : వార్షిక తనిఖీల్లో భాగంగా సంగారెడ్డి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిబ్బందికి అందించిన భద్రతా పరికరాలు, ట్రాఫిక్ నియంత్రణకు వినియోగించే సామగ్రిని పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను తనిఖీ చేయడంతో పాటు సిబ్బంది విధుల నిర్వహణకు సంబంధించిన వివరాలను సమీక్షించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రమాదాలకు అవకాశం లేకుండా పటిష్టంగా ట్రాఫిక్ నిబంధనలను అమలు చేయాలని సూచించారు. క్రమం తప్పకుండా వాహన తనిఖీలు చేపట్టడంతో పాటు మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా జాతీయ రహదారులపై తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను ప్రమాదకర ప్రాంతాలుగా గుర్తించి, వాహనదారులను అప్రమత్తం చేసేందుకు అవసరమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ తగిన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో డీఎస్పీ సత్యయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆకాశ్ కొల్లూరు

- **టీఆర్ఎస్ తరపున సీనియర్ జర్నలిస్టుకు అవకాశం**
- **రెండో స్థానంలోనూ బీసీ అభ్యర్థికే ప్రాధాన్యం**
- **ఎన్నికల పరిశీలకుడు, సమన్వయకర్తగా డాక్టర్ చిట్నేని రఘు నియామకం**



ప్రజానావ, హైదరాబాద్ : తెలంగాణ రక్షణ సేన తరపున హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా సీనియర్ జర్నలిస్ట్ ఆకాశ్ కొల్లూరును పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో సామాజిక సమీకరణాలకు ప్రాధాన్యత ఇస్తూ వరంగల్–ఖమ్మం–నల్గొండ స్థానానికి ఇప్పటికే బీసీ అభ్యర్థి నలమాస శ్రీకాంత్ గౌడ్‌ను ఖరారు చేసిన కవిత.. తాజాగా రెండో స్థానంలోనూ బీసీ సామాజిక వర్గానికి చెందిన ఆకాశ్ కొల్లూరుకు అవకాశం కల్పించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు, సమన్వయకర్తగా పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ చిట్నేని రఘును నియమించారు. రెండు ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించిన ఎన్నికల వ్యూహరచన, ప్రచార ప్రణాళిక, వార్‌రూమ్ నిర్వహణ బాధ్యతలను ప్రముఖ న్యాయవాది రామ్ కల్యాణ్ చల్లకు అప్పగించారు. ఉమ్మడి జిల్లాల వారీగా ఎన్నికల బాధ్యతలను కూడా పార్టీ నాయకులకు కేటాయించారు. హైదరాబాద్ జిల్లాకు సురభి, మతీన్, బండారి మహేందర్ ముదిరాజ్, రంగారెడ్డి జిల్లాకు అర్చనా సేనాపతి, మహబూబ్‌నగర్ జిల్లాకు రంజిత్ గొంగళ్లను ఇన్‌చార్జీలుగా నియమించారు. అదేవిధంగా నల్గొండ జిల్లాకు సుజిత్, ఖమ్మం జిల్లాకు గట్టు కరుణ, వరంగల్ జిల్లాకు మాడుగుల రాజిరెడ్డికి బాధ్యతలు అప్పగించారు. కాగా, హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించిన ఆకాశ్ కొల్లూరు నగరానికి చెందినవారు. జాతీయ స్థాయిలో పేరొందిన పలు మీడియా సంస్థల్లో రెండు దశాబ్దాలు గా జర్నలిస్టుగా సేవలందించారు. ఇండియా టుడే, రిపబ్లిక్ టీవీ, సీఎన్ఎన్ న్యూస్18, డైలీహంట్ వంటి ప్రముఖ సంస్థల్లో పనిచేసి విశేష అనుభవాన్ని సంపాదించారు. బేగంపేట హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో పాఠశాల విద్యను అభ్యసించిన ఆయన, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పట్టభద్రుడై బంగారు పతకాన్ని సాధించారు. జర్నలిజంలో సుదీర్ఘ అనుభవం, విద్యారంగంలో సాధించిన విజయాలతో ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆకాశ్ కొల్లూరును ఎంపిక చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లోనూ బీసీ అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా సామాజిక న్యాయానికి పెద్దపీట వేయాలన్న సంకేతాన్ని తెలంగాణ రక్షణ సేన ఇచ్చింది. ఎన్నికలను సమన్వయంతో ఎదుర్కొనేందు కు జిల్లా స్థాయి బాధ్యతలను ఖరారు చేయడంతో పాటు ప్రత్యేక వ్యూహరచన బృందాన్ని కూడా ఏర్పాటు చేసింది.

సేవాభావం, క్రమశిక్షణతోనే

ఉత్తమ

- **విద్యార్థులకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పిలుపు**
- **స్కౌట్స్ అండ్ గైడ్స్ పాఠశాల అభివృద్ధికి రూ.2.50 కోట్ల నిధులు**
- **బేడెన్–పావెల్ మెమోరియల్ హాల్ ప్రారంభం**
- **నిర్మాణానికి పలువురి ఆర్థిక సహకారం**



ప్రజానావ, హైదరాబాద్ : విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి, సేవాభా వాన్ని అలవర్చుకుని సమాజానికి ఉపయోగపడే బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి విద్య ఎంత ముఖ్యమో, నైతిక విలువలు, సమాజ సేవ పట్ల అంకితభావం కూడా అంతే అవసరమని పేర్కొన్నారు. దోమల్‌గూడలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ మోడల్ హైస్కూల్ ఆధునికీకరణ, అభివృద్ధి పనులకు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సీఎస్ఆర్ నిధుల నుంచి మంజూ రైన రూ.2.50 కోట్లతో చేపట్టనున్న పనుల కు శుక్రవారం గవర్నర్ శంకుస్థాపన చేశా రు. అనంతరం జీహెచ్ఎంసీ సహకారంతో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో చేపట్టిన సుందరీకరణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన విద్యా వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాల అభివృద్ధికి రూ.2.50 కోట్ల సీఎస్ఆర్ నిధులు అందించిన సింగరేణి సంస్థను అభినందించారు. చేపట్టనున్న పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. నిధుల మంజూరుకు చొరవ చూపిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సభ్యత్వం గణనీయంగా పెరుగుతుండటం సంతోషకరమని పేర్కొన్నారు. 2024–25లో 17,184గా ఉన్న సభ్యుల సంఖ్య 2025–26లో 47,448కు చేరిందని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 1,494 యూనిట్లు ఏర్పాటు కావడం సంస్థ విస్తరణకు నిదర్శనమన్నారు. మరో ఆరు వేల మంది ప్రభుత్వ ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు కార్యక్రమాలు కొనసాగుతు న్నాయని, ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన సుమారు 1.30 లక్షల మంది విద్యార్థులను స్కౌట్స్ అండ్ గైడ్స్ పరిధిలోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. యువత మొక్కల పెంపకం, నీటి సంరక్షణ, మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచారం, రహదారి భద్రత, ప్రజారోగ్య కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. స్కౌట్స్ గీతాన్ని తెలుగు, హిందీ భాషల్లో రూపొం దించి రాష్ట్రంలోని అన్ని పాఠశాలలతో పాటు లోక్‌భవన్‌లోనూ ప్రదర్శించాలని అధికారు లకు సూచించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ గవర్నర్ బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్రంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలు మరింత క్రియాశీలంగా కొనసాగుతున్నాయని అన్నారు. వ్యక్తిత్వ వికాసం, నిస్వార్థ సేవ నిజమైన నాయకత్వానికి పునాదులని, విద్యార్థులు సమాజ సేవకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ఎస్సీ, ఎస్టీ గురుకుల పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలను విస్తరించాలని సూచిం చారు. దీనివల్ల విద్యార్థుల్లో క్రమశి క్షణ, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత పెంపొందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర కమిషనర్ ఎం. దానకిశోర్, విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఈ. నవీన్ నికోలస్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా, సింగరేణి సంస్థ, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అధికారులు పాల్గొన్నారు.

బేడెన్–పావెల్ మెమోరియల్ హాల్‌ను

ప్రారంభించిన గవర్నర్

- **నిర్మాణానికి గవర్నర్ విచక్షణాధికార నిధి నుంచి రూ.35 లక్షలు**
- **బీడీఎల్ రూ.50 లక్షలు, ఎంపీ ఈటల రాజేందర్ రూ.15 లక్షల ఆర్థిక సాయం**

ప్రజానావ, హైదరాబాద్ : సేవాభావం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు యువతను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతాయని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. యువత సమాజ సేవలో చురుగ్గా పాల్గొంటూ దేశానికి ఉపయోగపడే బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. జీడిమెట్లలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ తెలంగాణ రాష్ట్ర శిక్షణ కేంద్రంలో నిర్మించిన బేడెన్–పావెల్ మెమోరియల్ హాల్‌ను శుక్రవారం గవర్నర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సభా మందిర నిర్మాణానికి వివిధ సంస్థలు, ప్రజాప్రతినిధులు అందించిన ఆర్థిక సహకారాన్ని ఆయన వివరించారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో గవర్నర్ విచక్షణాధికార నిధి నుంచి రూ.35 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల కింద రూ.50 లక్షలు అందించిందని, సంస్థ సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. అదేవిధంగా 2024–25లో మెదక్–మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ రూ.15 లక్షల ఆర్థిక సాయం అందించిన విషయాన్ని గుర్తుచేశారు. తెలంగాణలో స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యకలాపాల విస్తరణకు ప్రభుత్వం, వివిధ సంస్థలు అందిస్తున్న సహకారం ప్రశంసనీయమన్నారు. విద్యార్థుల్లో సేవాభావం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. యువతలో సామాజిక బాధ్యతను పెంపొందిస్తూ, సమాజ అభ్యున్నతికి దోహదపడేలా సంస్థ మరింత విస్తృతంగా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దానకిశోర్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఈ. నవీన్ నికోలస్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్ సీఎండీ శైలేష్ వాగర్‌వాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.





విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగుల పంపిణీ

- ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం
- ప్రభుత్వ విప్ వేముల వీరేశం

ప్రజానావ, నకిరేకల్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నల్లగొండ జిల్లా నకిరేకల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత పాఠశాల బ్యాగుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్వశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో 'అందరూ చదవాలి.. అందరూ ఎదగాలి' కార్యక్రమంలో భాగంగా యూనివర్సల్ ఫౌండేషన్, కోగ్టా ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థల సహకారంతో విద్యార్థులకు బ్యాగులను ఉచితంగా అందజేశారు. కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వేముల వీరేశం విద్యార్థులకు స్వయంగా బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించు కోవాలని, వాటిని సాధించే దిశగా పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే పిల్లలకు మెరుగైన విద్యాబోధనతోపాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యాభివృద్ధికి దాతలు, స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి ఇలాంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో మరిన్ని చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కోగ్టా ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇండియా కూటమి మహా ర్యాలీకి నల్గొండ కాంగ్రెస్ శ్రేణుల తరలింపు

ప్రజానావ, నల్గొండ : ఢిల్లీలోని రాంలీలా మైదానంలో నవంబర్ 1న ఇండియా కూటమి ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహా ర్యాలీకి నల్గొండ జిల్లా కాంగ్రెస్ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివెళ్లాయి. ఈ మేరకు శుక్రవారం నల్గొండ నియోజకవర్గం నుంచి బయలుదేరిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల ప్రత్యేక బస్సులను జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు పున్న కైలాష్ నేత జెండా ఊపి ప్రారంభించారు. ఈ బస్సుల్లో మండల కాంగ్రెస్ అధ్యక్షులు, జిల్లా డెలిగేట్లు, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ ప్రతినిధులతోపాటు వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు ఢిల్లీకి బయలుదేరారు. ఈ సందర్భంగా పున్న కైలాష్ నేత మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేసేందుకు ఇండియా కూటమి ఇచ్చిన పిలుపు మేరకు నిర్వహిస్తున్న మహా ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ప్రజా సమస్యలపై గళమెత్తేందుకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. జిల్లా నుంచి ఉత్సాహంగా ఢిల్లీకి తరలివెళ్తున్న నాయకులు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ ముఖ్య నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

సూపర్ ఎల్‌నినోను ఐక్యంగా ఎదుర్కొందాం

తూప్రాన్ మున్సిపల్ చైర్‌పర్సన్ బొంది రజని

ప్రజానావ, తూప్రాన్ : సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని సమష్టి కృషి, పరస్పర సహకారంతో ఎదుర్కోవాలని తూప్రాన్ మున్సిపల్ చైర్‌పర్సన్ బొంది రజని రవీందర్‌గౌడ్ ప్రజలకు పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రైతులు, యువత, మహిళలు నీటిని, డబ్బును పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. భయంకరమైన కరోనా మహమ్మారిని ఐకమత్యంతో ఎదుర్కొన్నట్లుగానే సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని కూడా సమష్టిగా ఎదుర్కోవచ్చని అన్నారు. నీటిని వృథా చేయకుండా అవసరమైన మేరకే వినియోగించాలని, అనవసర ఖర్చులను తగ్గించుకుని ఆర్థికంగా జాగ్రత్తలు పాటించాలని కోరారు. ముఖ్యంగా రైతులు వ్యవసాయంలో నీటి పొదుపు పద్ధతులను అనుసరించాలని సూచించారు. ప్రభుత్వం జారీ చేసే సూచనలు, మార్గదర్శకాలను పాటిస్తూ ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ పరిస్థితుల్లో వ్యక్తిగత జాగ్రత్తలతో పాటు సమాజంలోని ప్రతి ఒక్కరూ పరస్పరం సహకరించుకుంటూ ముందుకు సాగాలని చైర్‌పర్సన్ రజని కోరారు.

రక్తదానం.. ముగ్గురికి ప్రాణదానం

- పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో మెగా రక్తదాన శిబిరం
- ప్రారంభించిన డీఎస్పీ వెంకన్నబాబు, సింగరేణి జీఎం కృష్ణయ్య



ప్రజానావ, ఇల్లందు : రక్తదానం చేయడం ద్వారా ఎంతోమందికి ప్రాణదానం చేసినవారమవుతామని ఇల్లందు డీఎస్పీ వెంకన్నబాబు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఇల్లందు పోలీస్ సబ్ డివిజన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఇల్లందు సింగరేణి జనరల్ మేనేజర్ కృష్ణయ్య, డీఎస్పీ వెంకన్నబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బందితో పాటు ఇల్లందు, టేకులపల్లి, గుండాల సీఐలు సురేష్, సత్యనారాయణ, తిరుపతి, పలువురు ఎస్సైలు, స్థానికులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రక్తంలోని ప్లాస్మా, ఎర్ర రక్తకణాలు, ప్లేట్‌లెట్స్ వంటి భాగాలు అవసరమైన ముగ్గురు రోగులకు ఒకరి రక్తదానం ఉపయోగపడే అవకాశం ఉందని తెలిపారు. ఒక్కసారి రక్తదానం చేయడం ద్వారా ముగ్గురి ప్రాణాలు కాపాడేందు కు తోడ్పడినవారమవుతామని పేర్కొన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో రక్తదానం చేసిన పోలీసు సిబ్బంది, స్థానికులను అభినందించారు. సింగరేణి జీఎం కృష్ణయ్య మాట్లాడుతూ రక్తదానం చేస్తే నీరసం వస్తుందనే అపోహలను వీడాలని సూచించారు. రక్తదానంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని అన్నారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదుకు నవంబర్ 6 చివరి గడువు

- అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలి
- నూతనకల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కట్ట మల్లారెడ్డి పిలుపు

ప్రజానావ, నల్లగొండ : ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన పట్టభద్రులందరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని నూతనకల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట మల్లారెడ్డి పిలుపునిచ్చారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ఆదేశాల మేరకు ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ అభిప్రాయాన్ని ఓటు రూపంలో తెలియజేయాలంటే ముందుగా ఓటరుగా నమోదు చేసుకోవడం తప్పనిసరని పేర్కొన్నారు. ఓటరు నమోదు ప్రక్రియపై అర్హులైన పట్టభద్రులందరూ అవగాహన కలిగి ఉండాలని, తమతోపాటు చదువుకున్న స్నేహితులు, సహచరులు, ఇతర పట్టభద్రులకు కూడా ఈ విషయాన్ని తెలియజేసి నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలని కోరారు. పట్టభద్రుల ఓటరు నమోదుకు నవంబర్ 6వ తేదీ చివరి గడువు కావడంతో ఎవరూ నిర్లక్ష్యం చేయకుండా, చివరి వరకు వేచి చూడకుండా వెంటనే తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అర్హత ఉన్న ప్రతి పట్టభద్రుడు ఓటరు నమోదులో భాగస్వామి కావాలని, ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియలో తమ బాధ్యతను నిర్వర్తించాలని కట్ట మల్లారెడ్డి కోరారు.

మున్సిపల్ భూమి అక్రమ రిజిస్ట్రేషన్‌పై కొరడా

- రికార్డులు సృష్టించిన అధికారులపై క్రమశిక్షణా చర్యలు
- క్రిమినల్ కేసుకు కలెక్టర్ ఆదేశం
- 15 రోజుల్లో సమగ్ర విచారణ నివేదిక సమర్పించాలని స్పష్టం



ప్రజానావ, నల్లగొండ : హుజూర్‌నగర్ మున్సిపాలిటీకి చెందిన విలువైన భూమిని ప్రైవేట్ వ్యక్తుల పేరిట అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన వ్యవహారంపై జిల్లా యంత్రాంగం తీవ్రంగా స్పందించింది. మున్సిపల్ ఆస్తి పన్ను రికార్డులను అక్రమంగా సృష్టించి, వాటి ఆధారంగా ప్రభుత్వ ఆస్తిని ప్రైవేట్ వ్యక్తుల పేర్లపై రిజిస్ట్రేషన్ చేసినట్లు వచ్చిన ఆరోపణలపై బాధ్యులైన అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఆదేశించారు. ఈ వ్యవహారంలో క్రిమినల్ ఫిర్యాదు నమోదు చేయడంతోపాటు సమగ్ర విచారణ చేపట్టాలని స్పష్టం చేశారు. హుజూర్‌నగర్‌లో సుమారు 192 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న మున్సిపల్ బావి, దాని పక్కనే ఉన్న స్థలానికి సంబంధించి ఈ అక్రమ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. మున్సిపాలిటీకి చెందిన ఈ స్థలానికి సంబంధించి అక్రమంగా ఆస్తి పన్ను మదింపు రికార్డులు సృష్టించి, వాటిని ఆధారంగా చేసుకుని ప్రైవేట్ వ్యక్తుల పేరిట రిజిస్ట్రేషన్ చేయించినట్లు ఆరోపణలు వచ్చాయి. హుజూర్‌నగర్ ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్ సమర్పించిన నివేదికలను పరిశీలించిన కలెక్టర్ తదుపరి చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. ఆస్తి రికార్డుల సృష్టి, ధ్రువీకరణ, ప్రాసెసింగ్‌లో పాత్ర ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొం టున్న గతంలో విధులు నిర్వహించిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ రెవెన్యూ ఆఫీసర్/రెవెన్యూ ఆఫీసర్, మున్సిపల్ కమిషనర్‌పై క్రమశిక్షణా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సదరు అధికారులు ప్రస్తుతం ఎక్కడ పనిచేస్తున్నప్పటికీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో సంబంధం ఉన్న అవుట్‌సోర్స్ డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను ఇప్పటికే విధుల నుంచి తొలగించారు. వివాదాస్పద స్థలాన్ని పరిరక్షించేం దుకు తక్షణ చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషన ర్‌ను ఆదేశించిన కలెక్టర్.. భూమి యాజమాన్య హక్కులు, విస్తీర్ణం, హద్దులను క్షేత్రస్థాయిలో నిర్ధారించి, సంబంధిత రికార్డులను చట్టప్రకారం సరిచేయాలని సూచించారు. మున్సిపల్ ఆస్తుల రికార్డులను మోసపూరితంగా సృష్టించడం, దుర్వినియోగం చేయడం, అక్రమ లావాదేవీల్లో ప్రమేయం ఉన్నట్లు అనుమానిస్తున్న వ్యక్తులపై క్రిమినల్ ఫిర్యాదు నమోదు చేయాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో అనుసరించిన విధానాలు, సంబంధిత పత్రాలపై సమగ్ర వివరాలతో నివేదిక సమర్పించాలని సబ్ రిజిస్ట్రార్‌ను కోరారు. ఈ వ్యవహారంపై సూర్యాపేట అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు/రెవెన్యూ) సమగ్ర విచారణ చేపట్టనున్నారు. జిల్లావ్యాప్తంగా మున్సిపల్ భూములు, బావులు, రహదారులు, ప్రజా స్థలాలు, ఇతర ప్రభుత్వ ఆస్తులకు సంబంధించి ఇలాంటి అక్రమాలు మరెక్కడైనా జరిగాయా అనే అంశాన్ని కూడా పరిశీలించనున్నారు. ఈ వ్యవహారంలో సంబంధిత అధికారులు, ప్రైవేట్ వ్యక్తుల పాత్రను నిశితంగా పరిశీలించి 15 రోజుల్లోగా సమగ్ర నివేదిక అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ, మున్సిపల్ ఆస్తుల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, అక్రమాలకు పాల్పడినట్లు విచారణలో రుజువైతే బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.

సూపర్ ఎల్‌నినోతో అప్రమత్తంగా ఉండాలి

- వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటలపై దృష్టి పెట్టాలి
- 700 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు ఉచితంగా పంపిణీ
- త్వరలో ఏదుల నుంచి డిండి ప్రాజెక్టులోకి నీరు
- ఎమ్మెల్యే బాలు నాయక్



ప్రజానావ, దేవరకొండ : సూపర్ ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తుగా అప్రమత్తమై పంటల సాగులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రత్యామ్నాయ పంటల సాగుతో నష్టాలను నివారించుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమమే లక్ష్యంగా వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. చందంపేట మండలం పోలేపల్లి గ్రామంలోని రైతు వేదికలో శుక్రవారం రైతులకు వేరుశనగ విత్తనాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి మాట్లాడి ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, పంటల సాగు, సాగునీటి లభ్యత తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. రైతులపై పెట్టుబడి భారం తగ్గించి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 700 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను వంద శాతం రాయితీపై ఉచితంగా అందిస్తోందని ఎమ్మెల్యే వెల్లడించారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ సదుపాయాలను సమకూర్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని లాభదాయకమైన పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. ఈసారి సూపర్ ఎల్‌నినో ప్రభావం ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు వర్షాభావ పరిస్థితులను ముందుగానే అంచనా వేసుకొని సాగు ప్రణాళికలు రూపొందించుకోవాలని చెప్పారు. నీటి లభ్యత తక్కువగా ఉండే పరిస్థితుల్లో వరి సాగు చేపట్టి ఇబ్బందులు పడకుండా, వేరుశనగ వంటి తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను ఎంచుకోవాలని సూచిం చారు. వ్యవసాయ శాఖ అధికారులు అందించే సలహాలు, సూచనల మేరకు పంటలను ఎంపిక చేసుకోవాలని, ముందస్తు జాగ్రత్తలతో పంట నష్టాలను తగ్గించుకోవాలని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, త్వరలో ఏదుల నుంచి డిండి ప్రాజెక్టులోకి నీటిని తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని బాలు నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, రైతులతో పాటు దొండేటి మల్లారెడ్డి, ఏడుపుల గోవింద్ యాదవ్, మేకల రాజేందర్‌రెడ్డి, కిన్నెర హరికృష్ణ, వాంకునావత్ పాపా నాయక్, కేతావత్ భరత్, జక్కుల మున్నయ్య యాదవ్, కొప్పుల సురేందర్‌రెడ్డి, మండల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మరింత చేరువగా పోలీస్ సేవలు

- కొత్తపల్లి, గుండుమల్‌లో నూతన పోలీస్ స్టేషన్ల ఏర్పాటుకు స్థలాల పరిశీలన

ప్రజానావ, నారాయణపేట : జిల్లాలోని మద్దూర్, కోస్గి ప్రాంతాల పరిధిలో కొత్తపల్లి, గుండుమల్ గ్రామాల్లో నూతన పోలీస్ స్టేషన్ల ఏర్పాటుకు పోలీసు శాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆయా మండలాల్లో పోలీస్ స్టేషన్ల నిర్మాణానికి అనువైన స్థలాలను పరిశీలించారు. స్థలాల అనుకూలత, భౌగోళిక పరిస్థితులు, ప్రజలకు అందుబాటులో ఉండే విధానం తదితర అంశాలను క్షేత్రస్థాయిలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలను మరింత చేరువ చేయడం, శాంతిభద్రతలను బలోపేతం చేయడం, నేరాలను నియంత్రించడంతో పాటు ఫిర్యాదులపై వేగంగా స్పందించాలనే లక్ష్యంతో నూతన పోలీస్ స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల అవసరాలకు అనుగుణంగా, ప్రజలకు సులభంగా చేరుకునేలా స్థలాల ఎంపికపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. కొత్త పోలీస్ స్టేషన్ల ఏర్పాటుతో పరిసర గ్రామాల ప్రజలకు పోలీస్ సేవలు మరింత అందుబాటులోకి వస్తాయని, ఫిర్యాదులపై తక్షణ స్పందన, నేరాల నివారణ, శాంతిభద్రతల పరిరక్షణలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. ఈ పరిశీలన లో డీఎస్పీ నల్లపు లింగయ్య, సీఐ సైదులు, ఎస్సైలు విజయ్ కుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్ వెనక్కి తీసుకోవాలి

- నవంబర్ 6 నుంచి పరీక్షల నిర్వహణపై ఎస్ఎఫ్ఐ అభ్యంతరం
- నిర్ణయం మార్చుకోకుంటే పాలమూరు యూనివర్సిటీ ముట్టడిస్తామని హెచ్చరిక

ప్రజానావ, నారాయణపేట : పాలమూరు యూనివర్సిటీ పరిధిలో నవంబర్ 6 నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు విడుదల చేసిన షెడ్యూల్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు భాను ప్రసాద్, కార్యదర్శి పవన్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆరు నెలల వ్యవధిలో నిర్వహించాల్సిన సెమిస్టర్ పరీక్షలను కేవలం నాలుగు నెలల్లోనే నిర్వహించాలనే నిర్ణయం విద్యార్థులపై తీవ్ర ఒత్తిడిని పెంచుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పూర్తి స్థాయిలో పాఠ్యాంశాలు బోధించకుండా, పరీక్షలకు సిద్ధమయ్యేందుకు తగిన సమయం ఇవ్వకుండా పరీక్షలు నిర్వహించడం విద్యార్థుల విద్యా ప్రయోజనాలకు విరుద్ధమని పేర్కొన్నారు. యూనివర్సిటీ అధికారులు వెంటనే స్పందించి నవంబర్ 6 నుంచి పరీక్షలు నిర్వహించాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, సిలబస్ పూర్తిచేసి విద్యార్థులకు తగిన సన్నద్ధత సమయం ఇచ్చిన తర్వాతే పరీక్షలు నిర్వహించాలని కోరారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుండా మొండిగా వ్యవహరిస్తే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పాలమూరు యూనివర్సిటీని ముట్టడిస్తామని హెచ్చరించారు. విద్యార్థి సంఘాలతో చర్చించి న్యాయబద్ధమైన పరీక్షల షెడ్యూల్‌ను ప్రకటించాలని, విద్యార్థుల విద్యా హక్కుల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

పట్టభద్రులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలి

- అర్హులైన ప్రతి ఒక్కరూ గడువులోగా దరఖాస్తు చేసుకోవాలి
- సర్పంచ్ మట్ట యాదమ్మ

ప్రజానావ, వెల్దండ : అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఓటు హక్కును వినియోగించుకునేందుకు గ్రాడ్యుయేట్ ఓటరుగా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని వెల్దండ గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్యగౌడ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బి. కార్తీక్‌కుమార్‌కు పట్టభద్రుల ఓటు నమోదు దరఖాస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టభద్రులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ పేరును నమోదు చేసుకోవడం బాధ్యతగా భావించాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటుకు ఎంతో విలువ ఉందని, గ్రామంలోని అర్హులైన పట్టభద్రులందరూ ముందుకు వచ్చి నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. నిర్ణయించిన చివరి గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొయ్యల పుల్లయ్య, రేవల్లి రాజు, బొక్కల శ్రీను, మట్ట మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

మక్తల్‌లో ఊపందుకున్న ఉపాధి హామీ పనులు

ప్రజానావ, మక్తల్ : నారాయణపేట జిల్లా మక్తల్ మండలం దాదనపల్లి గ్రామపంచాయతీ పరిధిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు జోరుగా కొనసాగుతున్నాయని ఏపీవో సత్యమూర్తి, ఎంపీడీవో డి. రమేష్ తెలిపారు. గ్రామంలో సుమారు రూ.8.80 లక్షల విలువైన పనులు చేపట్టినట్లు వెల్లడించారు. గ్రామపంచాయతీలో దాదాపు 150 మంది జాబ్‌కార్డులు కలిగి ఉండగా, ప్రస్తుతం సుమారు 100 మంది పనుల్లో పాల్గొంటున్నట్లు సర్పంచ్ శివారెడ్డి వివరించారు. ఎల్‌నినో ప్రభావంతో పశువులకు నీటి కొరత ఏర్పడే పరిస్థితి ఉండటంతో మూగజీవాల అవసరాల కోసం నీటి కుంటలను నిర్మిస్తున్నట్లు ఎంపీడీవో రమేష్ తెలిపారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా 25 అడుగుల పొడవు, 16 మీటర్ల వెడల్పు, రెండు మీటర్ల లోతుతో నాలుగు నీటి కుంటల నిర్మాణ పనులు చేపట్టినట్లు ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్ శైలజ పేర్కొన్నారు. మండలంలోని ప్రజలు ఉపాధి హామీ పథకంలో తమ పేర్లను నమోదు చేసుకుని పనుల ద్వారా లబ్ధి పొందాలని ఎంపీడీవో సూచించారు. ఈ పథకం కింద ఒక్కొక్కరికి రోజుకు రూ.300 నుంచి రూ.400 వరకు ఉపాధి లభించే అవకాశం ఉందని ఏపీవో సత్యమూర్తి, ఎంపీడీవో రమేష్ తెలిపారు.



హెల్మెట్ ప్రాధాన్యాన్ని చాటిన 'నిర్లక్ష్యం'

షార్ట్‌ఫిల్మ్‌ను వీక్షించి చిత్రబృందాన్ని అభినందించిన ఎస్పీ రోహిత్‌రాజు

ప్రజానావ, కొత్తగూడెం : రహదారి భద్రతలో హెల్మెట్ ప్రాధాన్యాన్ని తెలియజేస్తూ రూపొందించిన 'నిర్లక్ష్యం' లఘుచిత్రాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు 70ఎంఎం యూట్యూబ్ ఛానల్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లఘుచిత్రం బాగుందని, సన్నివేశాలు సహజంగా ఉన్నాయని, నటీనటులు చక్కగా నటించారని ప్రశంసించారు. చిత్రబృందం చేపడుతున్న కార్యక్రమాలు, నిర్మాణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ప్రజలు ఎక్కువగా చిన్న వీడియోలు చూస్తున్న నేపథ్యంలో తక్కువ సమయంలోనే సమాజానికి మంచి సందేశాన్ని అందించేలా, ప్రజల్లో చైతన్యం కలిగించే లఘుచిత్రాలను రూపొందించాలని సూచించారు. పది నిమిషాల నిడివి ఉన్న చిత్రాన్ని పూర్తిగా వీక్షించిన ఎస్పీ ప్రతి సన్నివేశాన్ని, నటీనటుల నటనను పరిశీలించి దర్శకుడు శ్రీనివాస్ దొడ్డ పనితీరును అభినందించారు. అదే సమయంలో చిత్రంలోని లోటుపాట్లను కూడా వివరించారు. అనంతరం చిత్రబృందం ఎస్పీని శాలువాతో సన్మానించింది. కార్యక్రమంలో దర్శకుడు శ్రీనివాస్ దొడ్డ, నటీనటులు జలాల్, ఆవుదుర్తి సతీష్, ప్రేమ్‌సాగర్‌బాబు, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుని విజయాలు సాధించాలి

- కబడ్డీ పోటీల నుంచి నిష్క్రమించిన క్రీడాకారిణులకు మువ్వా విజయబాబు ప్రోత్సాహం
- చిరు బహుమతుల అందజేత



ప్రజానావ, సత్తుపల్లి : పట్టణంలో నిర్వహిస్తున్న 73వ రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల కబడ్డీ పోటీల్లో భాగంగా వివిధ జట్లు పోటీల నుంచి నిష్క్రమించిన నేపథ్యంలో ఆయా జట్ల క్రీడాకారిణులను మాజీ టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు ప్రోత్సహించారు. క్రీడాకారిణులకు చిరు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమికి నిరుత్సాహపడకుండా మరింత పట్టుదలతో సాధన చేసి భవిష్యత్తులో ఉన్నత విజయాలు సాధించాలని సూచించారు. మహిళా క్రీడాకారిణుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు మహిళా క్రీడలకు ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కటికాల క్రిస్టఫర్‌బాబు (రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఖమ్మం జిల్లా కార్యదర్శి), కె. స్వాతిముత్యం (రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి), చి. సుధాకర్ (ఖమ్మం జిల్లా సంయుక్త కార్యదర్శి), సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ కౌన్సిలర్లు, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, పొంగులేటి, మువ్వా అభిమానులు పాల్గొన్నారు.

క్యాంప్‌ఫైర్‌లో పాల్గొని ఉత్సాహం నింపిన మాజీ టీజీఐడీసీ చైర్మన్

పట్టణంలో జరుగుతున్న 73వ రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల కబడ్డీ పోటీల సందర్భంగా మాజీ టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు క్రీడాకారిణులతో నిర్వహించిన క్యాంప్‌ఫైర్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన మహిళా క్రీడాకారిణులతో ఆత్మీయంగా ముచ్చటించి వారిలో ఉత్సాహాన్ని నింపారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని, క్రమశిక్షణతో పాటు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శిస్తూ పోటీల్లో రాణించాలని సూచించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారిణుల మధ్య స్నేహభావం, ఐక్యతను పెంపొందించడంతో పాటు పోటీలకు ముందు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడంలో క్యాంప్‌ఫైర్ కార్యక్రమం ప్రత్యేకంగా నిలిచింది.



పిఆర్ జిటిఏ జిల్లా అధ్యక్షుడు శంకర్ బాబు ఎన్నిక

నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

ప్రజానావ, సిరిసిల్ల : నూతనంగా ఏర్పడిన పిఆర్ జిటిఏ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యవర్గం శుక్రవారం జిల్లా కలెక్టర్ ని మర్యాద పూర్యకంగా కలిసింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా లో పిఆర్ జిటిఏ రాష్ట్ర అధ్యక్షులు వేమిరెడ్డి దిలీప్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన జిల్లా కార్యవర్గం ఎన్నికలలో రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులుగా శంకర్ బాబు, ప్రధాన కార్యదర్శిగా మనోహర్, ఉపాధ్యాయులుగా కవిత, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ లు తిరుమల, రమేష్, సెక్రటరీ గా ఎల్లేష్ గౌడ్ లు ఏకగ్రీవం గా ఎన్నిక అయ్యారు. వీరికి జిల్లా కలెక్టర్ శుభాకాంక్షలు తెలుపుతూ ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ జనరల్ గురుకుల లోని ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి సానుకూలంగా తెలియపరుస్తానని ఈ సందర్భంగా పిఆర్ జిటిఏ జిల్లా కార్యవర్గం తెలిపింది.

ప్రజలకు పారదర్శకమైన పోలీస్ సేవలు అందించాలి

- **సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి**
- **తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ**



ప్రజానావ, సిరిసిల్ల : ప్రజలకు మరింత మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందిస్తూ పారదర్శకమైన సేవలు అందించాలని జిల్లా ఎస్పీ మహేష్ బి గితే సూచించారు. శుక్రవారం తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డుల నిర్వహణ, పెట్రోలింగ్ వ్యవస్థ అమలు, రౌడీషీటర్లు మరియు నేరస్తులపై నిఘా అంశాలను సమీక్షించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రజల్లో భద్రతాభావం కల్పించడంలో విజిబుల్ పోలీసింగ్ కీలక పాత్ర పోషిస్తుందని,అధికారులు,సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాలను తరచూ సందర్శిస్తూ ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తు వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. యువత మాదకద్రవ్యాలు, సైబర్ నేరాల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకునేలా విస్తృత స్థాయిలో గ్రామాల్లో, విద్యాసంస్థలు, కళాశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతిరోజూ వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించడంతో పాటు హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంపై ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టాలని ఆదేశించారు. ఎస్పీ వెంట డిఎస్పీ నాగేంద్రచారి, సిఐ నాగేశ్వరరావు, ఎస్ఐ అశోక్ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు ముందస్తు చర్యలు చేపట్టాలి

- **జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**
- **మిషన్ భగీరథ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష**



ప్రజానావ, సిరిసిల్ల : ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో రాబోయే వేసవి కాలం ముగిసే వరకూ జిల్లాలో తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వేసవి కాల సన్నద్ధత, తాగునీటి సరఫరాకు చేపట్టాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం మిషన్ భగీరథ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. అగ్రహారం, రుద్రవరం పంప్‌హౌస్‌లలోని పంపుసెట్లను ఎప్పుడూ సిద్ధంగా ఉంచాలని, ఇంకా కావలసిన యంత్రాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా ముందస్తుగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో మిషన్ భగీరథ ఎస్ ఈ రాములు, ఈఈ లు ముజాహిద్ అన్వర్, సుమలత, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రాము, విశ్వన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్‌కు మార్కెట్ కమిటీ సన్మానం



ప్రజానావ, వేములవాడ : వేములవాడ మార్కెట్ కమిటీ అభివృద్ధికి రూ. 3.94 కోట్ల నిధులు మంజూరు చేసిన ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ను వేములవాడ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు శుక్రవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ రొండి రాజు వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, డైరెక్టర్లు ఖమ్మం గణేష్, వస్తాద్ కృష్ణ గౌడ్, పాలకుర్తి పరశురాములు చీకోటి నాగరాజు, రాగిరి నాగరాజు పరశురాములు, సాబీర్ తదితరులు ఉన్నారు.

ఎస్ఐఆర్ ప్రక్రియ కొత్త కార్యక్రమం కాదు

- **ఓటర్ల సవరణ పై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం**
- **మీడియా సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి**

ప్రజానావ, సిరిసిల్ల : ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ కొత్తగా తీసుకొచ్చిన కార్యక్రమంగా ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచే ఎన్నికల వ్యవస్థలో భాగంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో కూడా అనేకసార్లు ఓటర్ల జాబితా సవరణ జరిగిందని గుర్తుచేశారు. ఓటర్ల జాబితాలో చనిపోయిన వ్యక్తుల పేర్లు కొనసాగడం, ఒకే వ్యక్తికి రెండు లేదా అంతకంటే ఎక్కువ చోట్ల ఓట్లు నమోదు కావడం వంటి సమస్యలను గుర్తించి సరిచేయడం ఎన్నికల ప్రక్రియలో కీలకమైన అంశమని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. అర్హత లేని పేర్లను నిబంధనల ప్రకారం తొలగించడం ద్వారా ఓటర్ల జాబితాను మరింత పారదర్శకంగా రూపొందించవచ్చని తెలిపారు. ఇలాంటి సవరణ ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ ఎందుకు వ్యతిరేకిస్తోందని ప్రశ్నించారు. ఓటర్ల జాబితా సవరణ అనేది ఏదైనా రాజకీయ పార్టీకి సంబంధించిన కార్యక్రమం కాదని, ఇది రాజ్యాంగబద్ధమైన ఎన్నికల ప్రక్రియలో భాగమని బీజేపీ నేతలు స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులు బూత్ లెవల్ ఆఫీసర్లుగా ఈ బాధ్యతలు నిర్వహిస్తున్నారని తెలిపారు. నిబంధనల ప్రకారం ఓటర్ల వివరాలను పరిశీలించి, అవసరమైన మార్పులు, చేర్పులు, తొలగింపులు చేపడుతున్నారని వివరించారు.



రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి

- **కమలాపూర్ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**



ప్రజానావ, హనుమకొండ : ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం కమలాపూర్ మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతిరోజూ ఎంతమంది రోగులు వైద్య సేవల కోసం వస్తున్నారు, వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారా అనే విషయాలను వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలోని పురుషుల, మహిళల వార్డులు, ఓపీ నమోదు విభాగాలను పరిశీలించారు. టీకాల గది, వైద్య రికార్డుల విభాగం, మందుల నిల్వ గదిని తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది హాజరు వివరాలను తెలుసుకుని రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోగులకు వైద్య సేవలు అందించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. చికిత్స కోసం వచ్చే రోగులకు ఆస్పత్రిలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, అవసరమైన అన్ని సదుపాయాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. మందుల నిల్వ, పంపిణీ నిర్వహణ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.



విద్యార్థులు తమ వ్యక్తిగత భద్రతపై అవగాహన కలిగి ఉండాలి

- **పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం**
- **సురక్షిత్ బచ్పన్ అభియాన్‌లో భాగంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన**
- **పోక్సో కోర్టు ప్రత్యేక జిల్లా న్యాయమూర్తి రాధిక జైస్వాల్**

ప్రజానావ, సిరిసిల్ల : పిల్లల రక్షణ, వారి హక్కులు, వ్యక్తిగత భద్రతపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని, బాలలపై జరిగే లైంగిక నేరాల పట్ల అప్రమత్తంగా ఉంటూ, ఎలాంటి వేధింపులు లేదా అనుచిత ప్రవర్తన ఎదురైనా భయపడకుండా సంబంధిత అధికారులకు తెలియజేయాలని పోక్సో కోర్టు ప్రత్యేక జిల్లా న్యాయమూర్తి రాధిక జైస్వాల్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు పి.నీరజ సూచనలతో బాలల హక్కులపై అవగాహన పెంపొందించడం లక్ష్యంగా "సురక్షిత్ బచ్పన్ అభియాన్" పేరుతో జిల్లా వ్యాప్తం గా నిర్వహిస్తున్న పాఠశాలల స్థాయి అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు పోక్సో చట్టంలోని ముఖ్యమైన నిబంధనలు, బాలలపై లైంగిక నేరాలకు పాల్పడితే విధించే శిక్షలు, బాలల చట్టపరమైన హక్కులు, రక్షణ చర్యలు మరియు అందుబాటులో ఉన్న న్యాయ పరిష్కార మార్గాల గురించి వివరించారు. మంచి స్పర్శ, చెడు స్పర్శ మధ్య తేడాను గుర్తించడం, అనుచిత ప్రవర్తనను గుర్తించడం గురించి తెలిపారు. అలాగే పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టె ఉపయోగం, దాని నిర్వహణ, ఉద్దేశాన్ని విద్యార్థులకు వివరించి, తమకు ఎదురయ్యే వేధింపులు, దుర్వినియోగం లేదా భద్రతకు సంబంధించిన సమస్యలను నిర్భయంగా ఫిర్యాదుల పెట్టె ద్వారా తెలియజేయవచ్చని ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అందించిన అవగాహన కరపత్రాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. బాలల భద్రత సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత.., బాలల హక్కులను కాపాడుతూ, వారికి సురక్షితమైన వాతావరణాన్ని కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కార్యక్రమంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు ఎన్. రమాదేవి, ప్రభుత్వ న్యాయవాది కల్యాణ్ చక్రవర్తి, లోక్ అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్, న్యాయవాదులు ఆడెపు వేణు, పెంట శ్రీనివాస్, కుంట శ్రీనివాస్, కళ్యాణి, జైశ్వర్య, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

అమరుల త్యాగం అజరామరం

- **జిల్లా ఎస్పీ మహేష్ బి గితే**
- **పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ**



ప్రజానావ, సిరిసిల్ల : శాంతిభద్రతల పరిరక్షణ కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీస్ అమరవీరుల త్యాగాలు ఎప్పటికీ అజరామరమని, వారి సేవలను భావితరాలకు తెలియజేయడం మనందరి బాధ్యత అని జిల్లా ఎస్పీ మహేష్ బి గితే అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా నుండి గాంధీ చౌరస్తా వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ వారి త్యాగాల ఫలితంగానే నేడు సమాజంలో ప్రశాంత వాతావరణం నెలకొందని తెలిపారు. ప్రజల భద్రత, సంక్షేమం కోసం విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలను స్మరించుకునేందుకు ప్రతి సంవత్సరం పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని, ఈ సంవత్సరం కూడా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అమరవీరుల స్మారకార్థం రక్తదాన శిబిరం, 2కే రన్, వ్యాసరచన పోటీలు, షార్ట్ ఫిల్మ్ పోటీలు, ఓపెన్ హౌస్ వంటి కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ లు, సిఐ లు, ఆర్ఐ లు, ఎస్ఐ లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

- **హేతుబద్ధీకరణ జీవో 25 ను సవరించాలి**
- **సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి**
- **టీపిటిఎఫ్ జిల్లాఅధ్యక్షులు దుమాల రమానాథ్ రెడ్డి డిమాండ్**

ప్రజానావ, సిరిసిల్ల : సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని వారికి సమాన పనికి సమాన వేతనం అందించాలని ఉద్యోగులకు రావలసిన అన్ని హక్కులను వారికి కల్పించాలని టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు దుమాల రమానాథ్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాజన్న సిరిసిల్ల జిల్లా లోని సిరిసిల్ల మండలం సభ్యత్వాల సేకరణ లో భాగంగా లో జిల్లా అధ్యక్షులు దుమాల రమానాథ్ రెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో 60 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలనే ప్రభుత్వ ఉత్తర్వు 25ను వెంటనే సవరించి ప్రతి ప్రాథమిక పాఠశాలకు తరగతికి ఒక ఉపాధ్యాయుని కేటాయించి, ప్రతి తరగతికి ఒక గదిని నిర్మించి , పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పిఆర్సి కమిషన్ వేసి మూడు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ నేటికీ పి ఆర్ సి నివేదికను తెప్పించుకోకపోవడం , ఫిట్మెంట్ ప్రకటించక పోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ రిపోర్ట్ తెప్పించుకొని 50 శాతం ఫిట్మెంట్ ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మైలారం తిరుపతి, సిరిసిల్ల మండలం అధ్యక్షులు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, లక్ష్మీ నారాయణ, రాంప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రాజన్న ఆలయ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్

ప్రజానావ, వేములవాడ : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి భక్తులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లో దేవాదాయ శాఖ కమిషనర్ హన్మంతరావుతో కలిసి వీటీఏడీఏ ఆధ్వర్యంలో చేపడుతున్న పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. పెండింగ్ పనులు, టెండర్ ప్రక్రియను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని శైలజా రామయ్యర్ సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్‌అండ్‌బీ సీఈ రాజేశ్వర్ రెడ్డి, దేవాదాయ శాఖ ధార్మిక సలహాదారు గోవింద హరి తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయ అభివృద్ధి, కార్తీక మాస ఏర్పాట్లపై ఉన్నత స్థాయి సమీక్ష

- **భక్తులకు మెరుగైన వసతులు కల్పించడంపై అధికారుల చర్చ**
- **భీమేశ్వరాలయంలో దీపోత్సవాలు, ప్రత్యేక పూజలకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు**



ప్రజానావ, వేములవాడ : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధి పనులు, రాబోయే కార్తీక మాసంలో భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై హైదరాబాద్‌లో శుక్రవారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామ్ అయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, ధార్మిక సలహాదారు గోవింద హరి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వేములవాడ రాజన్న ఆలయంలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ముఖ్యంగా రాజన్న ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీ భీమేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా నిర్వహించనున్న దీపోత్సవాలు, ప్రత్యేక పూజలకు సంబంధించి విస్తృతంగా సమీక్షించారు. కార్తీక మాసంలో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ముందుగానే అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్ల నిర్వహణ, తాగునీటి సదుపాయం, పారిశుద్ధ్య నిర్వహణ, ప్రత్యేక దర్శనాల ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని దిశానిర్దేశం చేశారు. ఆలయ పరిసరాల్లో భక్తుల రద్దీని నియంత్రించడంతో పాటు దర్శనం, పూజల సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆలయ అభివృద్ధి పనులను నిర్ణీత ప్రణాళిక ప్రకారం ముందుకు తీసుకెళ్లాలని, నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో వేములవాడ ఆలయ ఈవో ఎల్. రమాదేవి పాల్గొని అధికారులకు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజినీర్, కాంట్రాక్టర్లు, ఆర్కిటెక్ట్‌లు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొని అభివృద్ధి పనులు, కార్తీక మాస ఏర్పాట్లపై తమ అభిప్రాయాలు వెల్లడించారు.

ఇంద్రవెల్లిలో పంచజన్య సంకల్ప సభకు ఏర్పాట్లు పూర్తి

- **అమరవీరుల స్తూపం సమీపంలో సభా వేదిక**
- **హాజరుకానున్న తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత**



ప్రజానావ, ఆదిలాబాద్ : తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండల కేంద్రంలో నిర్వహించనున్న పంచజన్య సంకల్ప సభకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇంద్రవెల్లిలోని అమరవీరుల స్తూపం సమీపంలో ఉన్న మైదానంలో శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు సభ నిర్వహించనున్నారు. పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత సభకు హాజరుకానున్నారు. ఇప్పటికే పార్టీ శ్రేణులు వేదిక నిర్మాణంతో పాటు ప్రజలు కూర్చునేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. పార్టీ ఆవిర్భవించిన తర్వాత నిజామాబాద్, కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి అనంతరం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో పాంచజన్య సభ నిర్వహిస్తున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఉచిత విద్య, ఉచిత వైద్యం, యువతకు ఉపాధి, వ్యవసాయం, సామాజిక న్యాయం అనే అంశాలను ప్రధాన లక్ష్యాలుగా చేసుకుని పార్టీ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులు, ప్రజలకు పిలుపునిచ్చారు. ఏర్పాట్లను మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, మాజీ మంత్రి బోడ జనార్దన్ దగ్గరుండి పర్యవేక్షించారు.

ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలి

- **చంద్రాయన్‌పల్లి వద్ద కల్వర్టు పనులను పరిశీలించిన పోలీస్ కమిషనర్ సాయి చైతన్య**

ప్రజానావ, నిజామాబాద్ : జాతీయ రహదారి–44పై ఇందల్వాయి మండలం చంద్రాయన్‌పల్లి సమీపంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాన్ని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య పరిశీలించారు. అక్కడ కొనసాగుతున్న కల్వర్టు నిర్మాణ పనులను తనిఖీ చేసి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. కల్వర్టు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని జాతీయ రహదారుల విభాగం మేనేజర్ రంగారావు, కాంట్రాక్టర్ బాల్‌రెడ్డిని ఆదేశించారు. పనులు జరుగుతున్న సమయంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు సూచిక బోర్డులు, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, రాత్రి వేళల్లోనూ ప్రమాదకర ప్రాంతాలు స్పష్టంగా కనిపించేలా భద్రతా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ, జాతీయ రహదారుల అధికారులు, కాంట్రాక్టర్లు, టోల్‌ప్లాజా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ ప్రకాశ్, హైవే మేనేజర్ రంగారావు, కాంట్రాక్టర్ బాల్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్, డిచ్‌పల్లి సీఐ కె. వినోద్, ఇందల్వాయి ఎస్ఐ సుమలత, చంద్రాయన్‌పల్లి సర్పంచ్ రఘు, టోల్‌ప్లాజా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పోస్టల్ బ్యాలెట్‌తో ఓటేసిన తొలి పోప్ లియో–14

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో షికాగోలో ఓటు హక్కు వినియోగం: వాటికన్ ప్రకటన

వాటికన్ : క్యాథలిక్ చర్చి అధిపతి పోప్ లియో–14 అమెరికా మధ్యంతర ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశారు. దీంతో ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న తొలి పోప్‌గా ఆయన చరిత్ర సృష్టించినట్లు వాటికన్ వెల్లడించింది. అమెరికా పౌరుడైన పోప్ లియో–14 షికాగోలో తన ఓటును నమోదు చేసుకున్నట్లు శుక్రవారం ప్రకటించింది. అమెరికాలో నవంబర్ 3న మధ్యంతర ఎన్నికలు జరగనున్నాయి. కాగా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వ విధానాలపై పోప్ లియో–14 గతంలో పలు సందర్భాల్లో విమర్శలు చేశారు. ముఖ్యంగా వలసదారుల పట్ల అమెరికా ప్రభుత్వం అనుసరిస్తున్న కఠిన వైఖరిని, ఇరాన్‌పై యుద్ధాన్ని ఆయన వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో ఆయన ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

వర్షం కారణంగా ఇండియా కూటమి అభిశంసన వాయిదా

- **శనివారం ఖర్గే నివాసంలో నిర్వహణ**
- **అధ్యక్షత వహించనున్న మీరాకుమార్**

న్యూఢిల్లీ : భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ఇండియా కూటమి శుక్రవారం ఢిల్లీలో నిర్వహించాల్సిన 'ప్రజా అభిశంసన' కార్యక్రమం వాయిదా పడింది. ఉదయం నుంచి కురుస్తున్న భారీ వర్షం కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు కూటమి నేతలు వెల్లడించారు. శనివారం సాయంత్రం 4 గంటలకు సెంట్రల్ ఢిల్లీలోని రాజ్‌మార్గ్‌లో ఉన్న కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. కూటమిలోని పార్టీలన్నీ ఏకగ్రీవంగా అంగీకరించిన తర్వాతే వాయిదా నిర్ణయం తీసుకున్నామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్ అధ్యక్షత వహించనున్నారు.

బెంగళూరులో ట్రాఫిక్ జరిమానాలు భారీగా పెంపు

- **సగం హెల్మెట్ విక్రయాలపైనా చర్యలు**
- **ఫుట్‌పాత్‌పై బైక్ నడిపితే రూ.5 వేలు**



బెంగళూరు : నగరంలో ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలకు అడ్డుకట్ట వేసేందుకు కర్ణాటక ప్రభుత్వం జరిమానాలను భారీగా పెంచే యోచనలో ఉంది. సగం హెల్మెట్లు ధరించే వాహనదారులపై చర్యలు తీసుకోవడంతోపాటు, వాటిని విక్రయించే దుకాణాలు, తయారీదారులపైనా కఠిన చర్యలు చేపట్టాలని భావిస్తున్నది. ఫుట్‌పాత్‌లపై ద్విచక్ర వాహనాలు నడిపితే ప్రస్తుతం విధిస్తున్న రూ.500 జరిమానాను రూ.5 వేలకు పెంచాలని ప్రతిపాదించింది. అలాగే వన్‌వే నిబంధనను ఉల్లంఘిస్తే విధించే రూ.వెయ్యి జరిమానాను రూ.10 వేలకు పెంచాలని యోచిస్తున్నది. ఈ ప్రతిపాదనలు అమల్లోకి వస్తే ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలకు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది.

హోర్ముజ్ జలసంధిలో చమురు నౌకపై దాడి

- **లింపెట్ మైన్లతో పేలుడు**
- **27 మంది భారతీయులు సురక్షితం**



టెహ్రాన్ : హోర్ముజ్ జలసంధిలో చమురు నౌకలపై వరుస దాడులు ఆందోళన కలిగిస్తున్నాయి. పనామా జెండాతో ప్రయాణిస్తున్న ఎంటీ లూయిస్–1 చమురు నౌకపై అక్టోబర్ 30న లింపెట్ మైన్లతో దాడి జరిగింది. ఈ నౌకలో 27 మంది భారతీయులు ఉన్నారు. దాడి కారణంగా నౌక ఇంజిన్ గదిలో మంటలు చెలరేగాయి. అయితే సిబ్బంది వెంటనే అప్రమత్తమై మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. నౌకలో ఉన్న భారతీయులందరూ సురక్షితంగా ఉన్నారని కేంద్ర నౌకాయాన శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ వెల్లడించారు.

రైతుల ఆత్మహత్యలపై శివసేన ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు

- **అంత్యక్రియలకు ఎవరూ వెళ్లొద్దంటూ పిలుపు**
- **గైక్వాడ్ తీరుపై విమర్శలు**

ముంబై : మహారాష్ట్రలో రైతుల ఆత్మహత్యలపై శివసేన ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. బుల్దానాలో మీడియాతో మాట్లాడుతూ ఆత్మహత్య చేసుకున్న రైతుల అంత్యక్రియలకు ఎవరూ హాజరుకావద్దని ఆయన వ్యాఖ్యానించారు. వారి మృతదేహాలను జంతువులు తినే పరిస్థితి వస్తే, ఆత్మహత్య చేసుకోవాలనుకునే ఇతరులు దాని పరిణామాలను అర్థం చేసుకుని అలాంటి నిర్ణయానికి దూరంగా ఉంటారని అన్నారు. రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు లేదా ప్రభుత్వాన్ని సంప్రదించాలని, ఆత్మహత్యలు పరిష్కారం కావని పేర్కొన్నారు. అయితే రైతుల కష్టాలు, ఆర్థిక ఇబ్బందులపై స్పందించాల్సిన ప్రజాప్రతినిధి ఇలాంటి వ్యాఖ్యలు చేయడంపై వివిధ వర్గాల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



వ్యక్తి కంటిలో మొలిచిన విత్తనం

- **తలనొప్పి, కంటి వాపుతో ఆసుపత్రికి**
- **మూడు మిల్లీమీటర్ల వేరుతో విత్తనం తొలగించిన వైద్యులు**

మాస్కో : ప్రకృతిలోని వింతల్లో మరో ఆశ్చర్యకర ఘటన వెలుగులోకి వచ్చింది. ఓ వ్యక్తి కంటిలో విత్తనం మొలకెత్తిన ఘటన సైబీరియాలో చోటుచేసుకుంది. తీవ్రమైన తలనొప్పి, కంటి వాపు, రెండుగా కనిపించడం వంటి సమస్యలతో బాధపడుతున్న 42 ఏళ్ల మాక్సిమ్ స్లెప్ట్సోవ్‌ను పరీక్షించిన వైద్యులు ఆయన కంటిలో విత్తనం మొలకెత్తినట్లు గుర్తించారు. అనంతరం మత్తుమందు ఇచ్చి చిన్న సూది సాయంతో దానిని తొలగించారు. విత్తనం బయటకు తీసిన తర్వాత ఆయనకు తలనొప్పి తగ్గిపోయింది. వేసవిలో స్నేహితులతో కలిసి చేపలు పట్టేందుకు, అడవి పండ్లు సేకరించేందుకు మాక్సిమ్ మారుమూల ప్రాంతానికి వెళ్లారు. ఆ సమయంలో చెట్టు కొమ్మ ఒకటి ఆయన ముఖానికి తగిలి కంటికి గాయమైంది. కన్ను ఎర్రబడటం, నొప్పి, నీరు కారడం వంటి లక్షణాలు కనిపించడంతో నీటితో శుభ్రం చేసుకుని లోపల ఉన్న చిన్న బెరడు ముక్కను తొలగించారు. దీంతో సమస్య పరిష్కారమైందని భావించారు. అయితే ఆయనకు తెలియకుండా ఓ చిన్న విత్తనం కంటిలోనే ఉండిపోయింది. కొంతకాలానికి అది మొలకెత్తడంతో కంటి నొప్పి, తలనొప్పి పెరిగి చూపు కూడా మందగించింది. స్థానికంగా నరైన వైద్య సదుపాయాలు అందుబాటులో లేకపోవడంతో వందల కిలోమీటర్ల దూరంలోని యాకుట్స్ నగరానికి వెళ్లి నేత్ర వైద్య కేంద్రంలో పరీక్షలు చేయించుకున్నారు.

మూడు మిల్లీమీటర్ల వేరు గుర్తింపు

వైద్య పరీక్షల్లో కంటి తెల్లభాగాన్ని కప్పి ఉంచే పొరలోకి విత్తనం నుంచి వచ్చిన వేరు చొచ్చుకెళ్లినట్లు గుర్తించారు. నేత్ర వైద్య నిపుణురాలు ఎలిజవేటా కార్పోవా మత్తుమందు ఇచ్చి, ఇంజెక్షన్ సూది సాయంతో విత్తనాన్ని తొలగించారు. దాని వేరు సుమారు మూడు మిల్లీమీటర్ల పొడవు ఉన్నట్లు తెలిపారు. తన వైద్య వృత్తిలో ఇలాంటి ఘటనను చూడటం ఇదే తొలిసారి అని ఆమె పేర్కొన్నారు. వైద్య కేంద్ర ప్రధాన వైద్యుడు ఇవాన్ లుట్సాన్ సైతం ఈ ఘటనపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

రూ.86 వేల కోట్ల బకాయిల కోసం కాంట్రాక్టర్ల ఫోన్ నిరసన

- **మంత్రుల కార్యాలయాలకు వరుసగా కాల్స్ చేయాలని సంఘం పిలుపు**

ముంబై : చేసిన పనులకు చెల్లించాల్సిన రూ.86 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మహారాష్ట్ర కాంట్రాక్టర్లు నిరసనకు దిగారు. ఇందులో భాగంగా శుక్రవారం నుంచి 'ఫోన్ నిరసన' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రులు ఏక్‌నాథ్ షిండే, సునేత్రా పవార్‌తో పాటు వారి కార్యాలయాలకు పెద్దఎత్తున ఫోన్‌కాల్స్ చేయాలని మహారాష్ట్ర రాష్ట్ర కాంట్రాక్టర్ల సంఘం (ఎంఎస్‌సీఏ) సభ్యులకు పిలుపునిచ్చింది. శుక్రవారం ఫడ్నవీస్ కార్యాలయానికి, సోమవారం షిండే కార్యాలయానికి, మంగళవారం పవార్ కార్యాలయానికి ఫోన్లు చేయాలని సూచించింది. ఇందుకోసం కార్యాలయాల ల్యాండ్‌లైన్ నంబర్లను విడుదల చేసింది. సుమారు మూడు లక్షల మంది కాంట్రాక్టర్లు మంత్రులకు ఫోన్ చేసి తమ బిల్లులు చెల్లిస్తారా? లేదా? అని నిలదీయాలని కోరింది. ఏడాదిన్నరగా పనులు పూర్తిచేసినా బిల్లులు చెల్లించడం లేదని, ఆర్థిక ఇబ్బందులతో ఇప్పటికే పది మంది కాంట్రాక్టర్లు ఆత్మహత్య చేసుకున్నారని సంఘం ఆరోపించింది.





భూటాన్‌లో హిమానీనద సరస్సు ఉప్పొంగి ఆకస్మిక వరద

- **పశ్చిమబెంగాల్, అస్సాం రాష్ట్రాలకు హెచ్చరికలు**
- **గాసా త్సాచు వేడినీటి బుగ్గ సౌకర్యాలు ధ్వంసం**

న్యూఢిల్లీ : పొరుగు దేశం భూటాన్‌లోని గాసా జిల్లాలో షింటాపు హిమానీనద సరస్సు ఉప్పొంగడంతో ఆకస్మిక వరద సంభవించింది. ఈ ఘటనతో భారత్‌లోని పశ్చిమబెంగాల్, అస్సాం రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలకు వరద ముప్పు పొంచి ఉందని హెచ్చరికలు జారీ అయ్యాయి. గురువారం సాయంత్రం చోటుచేసుకున్న ఈ ఘటనలో మోచు నది ఒడ్డున ఉన్న ప్రసిద్ధ సహజ వేడినీటి బుగ్గ గాసా త్సాచులోని సౌకర్యాలు పూర్తిగా కొట్టుకుపోయాయి. అయితే ముందస్తుగానే ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయించడంతో ప్రాణనష్టం తప్పింది. మోచు నది ప్రారంభ ప్రాంతంలో ఉన్న షింటాపు సరస్సు భూటాన్‌లోని 17 ప్రమాదకర హిమానీనద సరస్సుల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. గతంలోనూ 2021 ఆగస్టు 26న మోచు నది ఉప్పొంగడంతో గాసా త్సాచు ప్రాంతం ఆకస్మిక వరదకు గురైంది. తాజాగా పునాఖా జోంగ్‌కు సుమారు ఎనిమిది కిలోమీటర్ల దూరంలోని కబేసా గెవాగ్ పరిధిలోని శ్రీగాంగ్ ప్రాంతాన్ని వరదనీరు దాటింది. భూటాన్ సరిహద్దు ప్రాంతాల్లో వరద ప్రమాదం నేపథ్యంలో భారత కేంద్ర ప్రభుత్వం పశ్చిమబెంగాల్, అస్సాం రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. అస్సాంలోని ధుబ్రి, పశ్చిమబెంగాల్‌లోని డార్జిలింగ్ కొండ ప్రాంతాలతో పాటు అలీపుర్‌దువార్, జల్‌పాయిగురి జిల్లాలకు ముప్పు పొంచి ఉన్నట్లు హెచ్చరించింది. కూచ్‌బెహార్‌లో సంకోష్ నది పరివాహక ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులు సూచించారు.

హిమానీనద సరస్సు విస్ఫోటనం అంటే..?

హిమానీనదాలు కరిగి వాటి సమీపంలో ఏర్పడిన సరస్సుల్లో నీరు ఒక్కసారిగా ఉప్పొంగి బయటకు ప్రవహించడాన్ని హిమానీనద సరస్సు విస్ఫోటనం అంటారు. భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడటం, హిమసంపాతాలు, భూకంపాలు, మంచు వేగంగా కరగడం వంటి కారణాలతో ఈ ప్రమాదాలు సంభవిస్తాయి. వాతావరణ మార్పుల కారణంగా ఉష్ణోగ్రతలు పెరగడం కూడా హిమానీనదాల కరుగుదలను వేగవంతం చేస్తోంది. సరస్సుల్లో నిల్వ ఉన్న నీరు ఒక్కసారిగా బయటకు రావడంతో దిగువ ప్రాంతాల్లో భారీ వరదలు సంభవించి ప్రాణ, ఆస్తి నష్టం కలిగే ప్రమాదం ఉంది.

భవిష్యత్తులో డబ్బు పాదుపు చేయడం నిరర్థకం

- **ఎలాన్ మస్క్**
- **ఏఐ, రోబోట్లతో అపారమైన సమృద్ధి**
- **2036 నాటికి డబ్బుకు ప్రాధాన్యం తగ్గొచ్చు**



న్యూఢిల్లీ : కృత్రిమ మేధస్సు (ఏఐ), రోబోట్ల అభివృద్ధితో భవిష్యత్తులో ప్రపంచం అపారమైన సమృద్ధితో నిండిపోతుందని ప్రముఖ వ్యాపారవేత్త, టెస్లా, స్పేస్‌ఎక్స్ సంస్థల అధినేత ఎలాన్ మస్క్ అభిప్రాయపడ్డారు. అందువల్ల సుదూర భవిష్యత్తు కోసం డబ్బు పొదుపు చేయడం నిరర్థకమని వ్యాఖ్యానించారు. ఏఐ సాంకేతికతలో వేగవంతమైన పురోగతితో వస్తువులు, సేవలు విస్తృతంగా అందుబాటులోకి వస్తాయని ఆయన చాలాకాలంగా చెబుతున్నారు. భవిష్యత్తులో అపారమైన సమృద్ధి ఏర్పడుతుందనే ఆశతో ప్రస్తుతం తీసుకుంటున్న కొన్ని ఆర్థికపరమైన తప్పుడు నిర్ణయాలను సమర్థించుకోవచ్చా? అంటూ ఓ సామాజిక మాధ్యమ వినియోగదారుడు సరదాగా చేసిన వ్యాఖ్యకు మస్క్ స్పందించారు. అత్యంత తెలివైన సాంకేతికతతో అపారమైన సమృద్ధి అందుబాటులోకి రానున్న నేపథ్యంలో దీర్ఘకాలిక భవిష్యత్తు కోసం డబ్బు పొదుపు చేయడం నిరర్థకమని పేర్కొన్నారు. ఏఐ, మనుషుల ఆకారంలో ఉండే రోబోట్లు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను పూర్తిగా మార్చగలవని ఆయన అభిప్రాయపడ్డారు. 2036 నాటికి డబ్బుకు ప్రాధాన్యం లేకుండా పోవచ్చని కూడా గతంలో వ్యాఖ్యానించారు.

మస్క్ వాదన వెనుక కారణమిదే!

ప్రస్తుతం ఆహారం, నివాసం, రవాణా, వినోదం వంటి అవసరాలు తీర్చుకోవడానికి ప్రజలు ప్రధానంగా డబ్బుపైనే ఆధారపడుతున్నారు. అయితే భవిష్యత్తులో ఏఐ, రోబోట్లు మానవ అవసరాలకు మించి వస్తువులు, సేవలను ఉత్పత్తి చేయగలిగితే వాటి లభ్యత పెరిగి ఖర్చులు తగ్గుతాయని మస్క్ భావిస్తున్నారు. ఉత్పత్తి, సేవల రంగాల్లో ఆటోమేషన్ పెరగడం వల్ల వస్తువుల కొరత తగ్గి సమాజంలో సమృద్ధి ఏర్పడుతుందని ఆయన అంచనా. అటువంటి పరిస్థితుల్లో ప్రస్తుత ఆర్థిక వ్యవస్థలో డబ్బుకు ఉన్న ప్రాధాన్యం గణనీయంగా తగ్గవచ్చన్నది ఆయన అభిప్రాయం. అయితే ఇవి మస్క్ వ్యక్తిగత అంచనాలు మాత్రమే.

యువకుడి ఖాతాలో రూ.లక్ష కోట్లు

- **సాంకేతిక లోపంతో కనిపించిన భారీ మొత్తం**
- **రూ.55 వేలూ తీసుకోలేని పరిస్థితి**

సికార్ : నెలకు రూ.10 వేల జీతంతో పనిచేస్తున్న ఓ యువకుడి బ్యాంకు ఖాతాలో ఏకంగా రూ.లక్ష కోట్లు కనిపించడంతో అతడు అవాక్కయ్యాడు. రాజస్థాన్‌లోని సికార్‌కు చెందిన 22 ఏండ్ల సమీర్ ఖాన్ బుధవారం మొబైల్ రీచార్జి చేసేందుకు బ్యాంకింగ్ యాప్ తెరవగా తన ఖాతాలో భారీ మొత్తం ఉన్నట్టు గుర్తించాడు. అయితే ఆ నిధుల ఉపసంహరణపై ఆంక్షలు విధించినట్టు కనిపించడం తోపాటు, తన వద్ద ఉన్న రూ.55 వేల మొత్తాన్ని కూడా తీసుకునే అవకాశం లేకుండా పోయింది. దీంతో వెంటనే తన యజమానికి విషయం చెప్పి, ఆయనతో కలిసి సైబర్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాడు. పోలీసుల సూచన మేరకు బ్యాంకు అధికారులను సంప్రదించగా, సాంకేతిక లోపం కారణంగా ఖాతాలో రూ.లక్ష కోట్లు జమ అయినట్టు కనిపించిందని వివరించారు. అనంతరం ఖాతాలోని వివరాలను సరిచేశారు.



ఇజ్రాయెల్ ఎన్నికల్లో హంగ్

- **61 స్థానాల మ్యాజిక్ ఫిగర్ దాటని కూటములు**
- **27 స్థానాలతో అతిపెద్ద పార్టీగా లికుడ్**

ఇజ్రాయెల్ : ఇజ్రాయెల్ ఎన్నికల్లో ఏ పార్టీకి, కూటమికి స్పష్టమైన మెజారిటీ లభించకపోవడంతో హంగ్ పరిస్థితి ఏర్పడినట్లు వెల్లడైన ఫలితాలు సూచిస్తున్నాయి. మొత్తం 120 స్థానాలున్న పార్లమెంటులో ప్రభుత్వ ఏర్పాటుకు కనీసం 61 స్థానాలు అవసరం. అయితే ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు నేతృత్వంలోని అధికార కూటమికి 53 స్థానాలు మాత్రమే దక్కినట్లు సమాచారం. నెతన్యాహుకు చెందిన లికుడ్ పార్టీ 27 స్థానాలు గెలుచుకుని అతిపెద్ద పార్టీగా నిలిచింది. ప్రతిపక్ష కూటమికి 48 స్థానాలు లభించగా, అరబ్ పార్టీలకు మొత్తం 19 స్థానాలు దక్కినట్లు పేర్కొంటున్నారు. మిలిటరీ సిబ్బంది, రిజర్వు సైనికులు, దౌత్యవేత్తలు, ఆసుపత్రుల్లో ఉన్న రోగులు, వైద్య సిబ్బంది, ఖైదీలు వేసిన డబుల్ ఎన్వలప్ బ్యాలెట్లు లెక్కింపుతో అధికార కూటమి స్థానాలు పెరుగుతాయని విశ్లేషకులు అంచనా వేసినా, తుది సమీకరణాల్లో పెద్దగా మార్పు రాలేదని సమాచారం. దీంతో ప్రభుత్వ ఏర్పాటుపై అనిశ్చితి నెలకొంది. 19 స్థానాలు గెలుచుకున్న అరబ్ పార్టీల మద్దతు లేకుండా ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజారిటీ సాధించడం కూటములకు సవాలుగా మారింది. అయితే అధికార, ప్రతిపక్ష కూటములు అరబ్ పార్టీలతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు విముఖత చూపుతున్నట్లు కథనం పేర్కొంటోంది. ఈ నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష కూటములు కలిసి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశాలపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇదిలా ఉండగా ఎన్నికల్లో విదేశాలు జోక్యం చేసుకున్నాయని నెతన్యాహు ఆరోపించారు. ఈ పరిణామాన్ని భూకంపం వంటి విపత్తుగా అభివర్ణిస్తూ పోలీసు, అంతర్గత భద్రతా విభాగాలు దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. అరబ్ పార్టీలు ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డాయని ఆరోపించడంతో పాటు, వాటితో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసే ప్రసక్తే లేదని స్పష్టం చేసినట్లు సమాచారం.

కానూ గాంధీ భూమి కేసులో అమెరికా కోర్టు కీలక తీర్పు

- **30 ఎకరాల స్థలాన్ని ఖాళీ చేయాలని ఆక్రమణదారుడికి ఆదేశం**
- **ట్రస్టు తరపున న్యాయపోరాటం చేసిన పరిమల్ దేశాయ్‌కు అనుకూలంగా తీర్పు**



సూరత్ : మహాత్మా గాంధీ మనవడు కానూ గాంధీకి చెందిన అమెరికాలోని 30 ఎకరాల భూమి వివాదంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. వర్జీనియా రాష్ట్రంలోని వారెన్ కౌంటీలో ఉన్న ఆ స్థలాన్ని ఆక్రమించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న గ్రెగరీ బ్లాక్ అనే వ్యక్తి అక్కడి నుంచి ఖాళీ చేయాలని అమెరికా కోర్టు ఆదేశించింది. ఈ భూమికి సంబంధించిన న్యాయపోరాటాన్ని కానూ గాంధీ, ఆయన భార్య శివా గాంధీ తరఫున సూరత్‌కు చెందిన పరిమల్ దేశాయ్ చేపట్టారు. షెనాండోవా జాతీయ పార్కు సమీపంలో ఉన్న ఈ 30 ఎకరాల స్థలాన్ని కానూ గాంధీ 1987లో కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. తన చివరి రోజుల్లో దక్షిణ గుజరాత్‌లో నివసించిన ఆయన ఒక స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి ఆస్తులను దానికి బదిలీ చేశారు. ప్రస్తుతం ఆ ట్రస్టుకు పరిమల్ దేశాయ్ మేనేజింగ్ ట్రస్టీగా వ్యవహరిస్తున్నారు. 2025 జనవరి 10న గ్రెగరీ బ్లాక్ తనకు నోటీసు పంపి, వర్జీనియాలోని భూమి తన ఆధీనంలో ఉందని పేర్కొన్నట్లు దేశాయ్ వెల్లడించారు. సుమారు 15 ఏళ్లుగా ఆ స్థలాన్ని తన ఆధీనంలో ఉంచుకున్నట్లు బ్లాక్ వాదించినప్పటికీ, కోర్టులో తన వాదనకు తగిన ఆధారాలు చూపలేకపోయారని తెలిపారు. మరోవైపు 2008 నుంచి ఆ స్థలంలో నివసిస్తున్నానని, అక్కడ కొన్ని నిర్మాణ మార్పులు కూడా చేపట్టానని బ్లాక్ వాదించారు. ఈ వివాదంపై సుమారు 20 నెలలపాటు విచారణ కొనసాగింది. 2024లో తొలిసారిగా అమెరికా వెళ్లిన పరిమల్ దేశాయ్ సుమారు 4,500 డాలర్లు ఖర్చు చేసి భూమి సర్వే చేయించారు. 2025లో కానూ గాంధీ వీలునామాను అమెరికా కోర్టులో సమర్పించి, అనంతరం భూమి హక్కులను ట్రస్టు పేరిట నమోదు చేయించినట్లు వివరించారు. కానూ గాంధీ, శివా గాంధీ 2013లో భారత్‌కు తిరిగి వచ్చారు. కానూ గాంధీ 2016 నవంబర్‌లో సూరత్‌లో మరణించగా, ఆయన వీలునామా ప్రకారం ఆస్తులన్నీ భార్య శివా గాంధీకి బదిలీ అయ్యాయి. 2018లో శివా గాంధీ ట్రస్టును ఏర్పాటు చేసి తన వీలునామాను నమోదు చేశారు. 2020లో ఆమె మరణించిన అనంతరం పరిమల్ దేశాయ్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీగా బాధ్యతలు స్వీకరించారు. అక్టోబర్ 21న న్యాయమూర్తి డారిల్ ఎల్. ఫంక్ దేశాయ్‌కు అనుకూలంగా తీర్పు వెల్లడించారు. భూమిలో ఏర్పాటు చేసిన తాత్కాలిక నిర్మాణాలను తొలగించి స్థలాన్ని ఖాళీ చేయాలని గ్రెగరీ బ్లాక్‌ను ఆదేశించారు. ఈ ఆస్తుల ద్వారా వచ్చే వనరులను గాంధీ తత్వ ప్రచారం, స్వచ్ఛంద కార్యక్రమాల నిర్వహణకు వినియోగించనున్నట్లు ట్రస్టు ప్రతినిధులు తెలిపారు.

నావిక్ వ్యవస్థకు మరింత బలం

- **ఎన్‌వీఎస్–03 ఉపగ్రహంతో జీఎస్‌ఎల్‌వీ ప్రయోగం విజయవంతం**

శ్రీహరికోట : భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ మరో కీలక విజయాన్ని సాధించింది. దేశీయ నావిగేషన్ వ్యవస్థ 'నావిక్'ను మరింత బలోపేతం చేసే ఎన్‌వీఎస్–03 ఉపగ్రహాన్ని మోసుకెళ్లిన జీఎస్ఎల్వీ రాకెట్ శుక్రవారం అర్ధరాత్రి విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లింది. రాత్రి 11.51 గంటలకు శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం రెండో ప్రయోగ వేదిక నుంచి ప్రయోగాన్ని చేపట్టారు. సుమారు 50 మీటర్ల ఎత్తు, మూడు దశలతో కూడిన ఈ రాకెట్ ప్రయోగ సమయంలో 420 టన్నుల బరువును కలిగి ఉంది. 2,232 కిలోల బరువున్న ఎన్‌వీఎస్–03 ఉపగ్రహాన్ని నిర్దిష్ట జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ కక్ష్యలో ప్రవేశపెట్టింది. దేశీయంగా అభివృద్ధి చేసిన ప్రాంతీయ నావిగేషన్ వ్యవస్థ నావిక్ సేవలను మెరుగుపరచడంలో ఈ ఉపగ్రహం కీలకంగా నిలవనుంది. ఇందులో స్వదేశీ, విదేశీ అణు గడియారాలను అమర్చారు.





ఫిలిప్స్ సూపర్ సెంచరీ

- నాలుగో టీ20లో టీమిండియాపై 87 పరుగుల విజయం
- అర్ధ సెంచరీతో ఆకట్టుకున్న బ్రేస్‌వెల్
- అర్ష్‌దీప్ అరుదైన రికార్డు

ఆక్లాండ్: వరుసగా మూడు విజయాలతో సిరీస్ కైవసం చేసుకున్న భారత్‌కు నాలుగో టీ20లో న్యూజిలాండ్ షాకిచ్చింది. గ్లెన్ ఫిలిప్స్ (49 బంతుల్లో 107), మైఖేల్ బ్రేస్‌వెల్ (25 బంతుల్లో 65) విధ్వంసక బ్యాటింగ్‌తో కివీస్ 7 వికెట్లకు 259 పరుగులు చేసింది. అనంతరం జాకబ్ డఫీ (4/23) ధాటికి భారత్ 9 వికెట్లకు 172 పరుగులకే పరిమితమైంది. దీంతో న్యూజిలాండ్ 87 పరుగుల తేడాతో గెలిచింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 3–1తో ఆధిక్యంలో కొనసాగుతోంది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన కివీస్ 3 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. మయాంక్ యాదవ్ సీఫెర్ట్ (3), డారిల్ మిచెల్ (24)ను పెవిలియన్‌కు పంపాడు. ఫిన్ అలెన్ (31)తో కలిసి ఫిలిప్స్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. అనంతరం బ్రేస్‌వెల్‌తో జతకలిసి భారత బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఐదో వికెట్‌కు కేవలం 41 బంతుల్లోనే 115 పరుగులు జోడించారు. ఫిలిప్స్ 31 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసి, నితీశ్ రెడ్డి వేసిన 16వ ఓవర్లో వరుసగా నాలుగు సిక్సర్లతో సహా 32 పరుగులు పిండుకున్నాడు. బ్రేస్‌వెల్ 18 బంతుల్లోనే అర్ధశతకం సాధించగా.. ఫిలిప్స్ 46 బంతుల్లో శతకం పూర్తి చేసుకున్నాడు. చివరి ఐదు ఓవర్లలో కివీస్ 85 పరుగులు రాబట్టింది.

తొలి ఓవర్లోనే రెండు వికెట్లు

260 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు డఫీ తొలి ఓవర్లోనే శాంనన్ (4), ఇషాన్ కిషన్ (0)ను ఔట్ చేసి షాకిచ్చాడు. శ్రేయస్ అయ్యర్ (22), అభిషేక్ శర్మ (27) మూడో వికెట్‌కు 46 పరుగులు జోడించినా జట్టును ఆదుకోలేకపోయారు. పవర్‌ప్లే ముగిసేసరికి భారత్ 4 వికెట్లకు 61 పరుగులు చేసింది. అనంతరం సాంట్నర్ (2/23) కట్టుదిట్టమైన బౌలింగ్‌తో భారత బ్యాటర్లను కట్టడి చేశాడు. దీంతో టీమ్‌ఇండియాకు ఓటమి తప్పలేదు. భారత పేసర్ అర్ష్‌దీప్ సింగ్ ఈ మ్యాచ్‌లో తన 150వ టీ20 అంతర్జాతీయ వికెట్ సాధించాడు. ఈ ఘనత అందుకున్న తొలి భారత బౌలర్‌గా రికార్డు సృష్టించాడు.



రెజ్లింగ్‌లో సరికొత్త అధ్యాయం

- స్వర్ణం సాధించిన మనీషా భన్వాలా.. తొలి భారత మహిళగా రికార్డు
- ప్రపంచ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో అమెరికా రెజ్లర్‌పై 8–6తో విజయం
- ఒకే టోర్నీలో ముగ్గురు భారత మహిళలు ఫైనల్‌కు చేరడం ఇదే తొలిసారి



అస్తానా: భారత మహిళా రెజ్లింగ్ చరిత్రలో మనీషా భన్వాలా సరికొత్త అధ్యాయం లిఖించింది. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించిన తొలి భారతీయ మహిళగా ఘనత సాధించింది. కజకిస్థాన్‌లోని అస్తానాలో జరుగుతున్న పోటీల్లో శుక్రవారం 59 కిలోల విభాగం ఫైనల్లో అమెరికా రెజ్లర్ అబిగైల్ నెట్టేపై 8–6తో విజయం సాధించింది. 29 ఏళ్ల మనీషా.. ప్రపంచ టైటిల్ నెగ్గిన రెండో భారత రెజ్లర్‌గా నిలిచింది. 2010లో పురుషుల 66 కిలోల విభాగంలో సుశీల్ కుమార్ ఈ ఘనత సాధించాడు.

0–6 నుంచి పుంజుకొని..

ఫైనల్లో అమెరికా రెజ్లర్ ఆరంభంలో ఆధిపత్యం ప్రదర్శించింది. మనీషాను మ్యాట్ అంచు వద్ద పడేసి పాయింట్లు సాధించడంతో స్కోరు 0–6కు చేరింది. అయితే తొలి అర్ధభాగం ముగిసేలోపు మనీషా ఖాతా తెరిచింది. రెండో అర్ధభాగంలో ప్రత్యర్థి దాడులను సమర్థంగా అడ్డుకుంటూ పుంజుకుంది. కాలి దాడి నుంచి తప్పించుకుని వెనుక నుంచి పట్టుకుని పాయింట్లు సాధించింది. అనంతరం గట్ రెంచ్ టెక్నిక్‌తో స్కోరును 6–6తో సమం చేసింది. చివర్లో మరోసారి దాడి చేసి రెండు పాయింట్లు సాధించి 8–6తో ఆధిక్యంలోకి వెళ్లింది. మ్యాచ్‌కు 27 సెకన్లే మిగిలి ఉండగా ఆ ఆధిక్యాన్ని కాపాడుకుని విజయం ఖరారు చేసుకుంది.

మహిళల జట్టు సరికొత్త రికార్డు

ఈ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారత మహిళల జట్టు మరో ఘనత సాధించింది. ఒకే టోర్నీలో ముగ్గురు భారత రెజ్లర్లు స్వర్ణ పతక పోటీలకు చేరడం ఇదే తొలిసారి. 50 కిలోల విభాగంలో నీలం సిరోహా, 76 కిలోల్లో కాజల్ ధోచక్ గురువారం ఫైనల్లో ఓడి రజత పతకాలతో సరిపెట్టుకున్నారు. మనీషా స్వర్ణంతో భారత్‌కు ఈ టోర్నీలో తొలి పసిడిని అందించింది.

హైలో ఓపెన్ సెమీస్‌లో సింధు

- జర్మనీ క్రీడాకారిణిపై విజయం

సార్‌బ్రూకెన్: భారత స్టార్ షట్లర్ పీవీ సింధు హైలో ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో సెమీఫైనల్‌కు చేరింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో జర్మనీకి చెందిన అమాలీ షుల్జ్‌ను 21–12, 21–10తో వరుస గేముల్లో ఓడించింది. రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత అయిన సింధు ఈ మ్యాచ్‌ను కేవలం 27 నిమిషాల్లోనే ముగించింది. మరో క్వార్టర్ ఫైనల్లో అన్మోల్ ఖర్బ్ 21–17, 18–21, 21–16తో ఆరో సీడ్ ఉన్నతి హూడాను ఓడించి సెమీస్‌కు చేరింది. దీంతో సెమీఫైనల్లో సింధు, అన్మోల్ తలపడనున్నారు. ఈ మ్యాచ్‌లో గెలిచిన భారత షట్లర్ ఫైనల్‌కు చేరుతుంది.

ఇక ప్రతి ఏడాది క్రియో డే

- ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ విస్తరణకు ఐసీసీ నూతన కార్యక్రమం

దుబాయ్: ప్రపంచవ్యాప్తంగా క్రికెట్‌ను మరింత విస్తరించే లక్ష్యంతో అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఏటా నవంబరు 1న 'క్రియో డే' నిర్వహించాలని నిర్ణయించింది. ఐసీసీ చేపట్టిన క్రియో కార్యక్రమం ద్వారా ఇప్పటికే 10 లక్షల మందికి పైగా క్రికెట్ చేరిన సందర్భంగా ఈ వేడుకకు శ్రీకారం చుట్టింది. 2021లో ప్రారంభమైన ఈ కార్యక్రమం ద్వారా 18 భాషల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నారు. ఐసీసీకి చెందిన 65 అసోసియేట్ దేశాలు జాతీయ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తుండగా, 12 పూర్తిస్థాయి సభ్య దేశాల్లో క్రియో శిక్షకులకు ధ్రువీకరణ ఇచ్చారు. నైజీరియాలోని లాగోస్‌కు చెందిన 13 ఏళ్ల సైదత్ హంజాత్ ఈ కార్యక్రమంలో 10



లక్షో క్రీడాకారిణిగా నిలిచింది. పాఠశాలలో నిర్వహించిన క్రియో కార్యక్రమం ద్వారా క్రికెట్‌పై ఆసక్తి పెంచుకున్న ఆమె.. ఈ ఆట తనకు క్రమశిక్షణ, ఆనందం, లక్ష్యాన్ని ఇచ్చిందని తెలిపింది. క్రియోలో పాల్గొంటున్న వారిలో మహిళలు, పురుషులు చెరో 50 శాతం ఉండడం విశేషం.



డిపాజిట్ల కంటే రుణాలే ఎక్కువ

- బ్యాంకుల రుణాల్లో 17.94 శాతం వృద్ధి
- అక్టోబరు 15 నాటికి రూ.232.54 లక్షల కోట్లకు రుణాలు మంజూరు


ముంబై: దేశీయ బ్యాంకుల్లో రుణాల మంజూరు వేగం డిపాజిట్ల సమీకరణను మించిపోయింది. ఈ ఏడాది అక్టోబరు 15 నాటికి బ్యాంకుల రుణాలు గతేడాదితో పోలిస్తే 17.94 శాతం పెరిగి రూ.232.54 లక్షల కోట్లకు చేరాయి. డిపాజిట్లు మాత్రం 16.60 శాతం వృద్ధితో రూ.284.37 లక్షల కోట్లకు పరిమితమయ్యాయి. ఈ వివరాలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వెల్లడించింది. గతేడాది అక్టోబరు 17 నాటికి బ్యాంకుల రుణాలు రూ.197.17 లక్షల కోట్లు, డిపాజిట్లు రూ.243.88 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. పండుగల సీజన్‌లో రుణాలకు పెరిగిన డిమాండ్, బ్యాంకింగ్ వ్యవస్థలో అందుబాటులో ఉన్న అధిక నిధులు రుణ వృద్ధికి దోహదపడ్డాయి. ఆర్బీఐ ప్రత్యేక వెసులుబాటు ద్వారా బ్యాంకులు ఎఫ్‌సీఎన్ఆర్ (బి) డిపాజిట్లను భారీగా సమీకరించడంతో అక్టోబరు 1–15 మధ్య వ్యవస్థలో నగదు లభ్యత రూ.2 లక్షల కోట్ల నుంచి రూ. 4.5 లక్షల కోట్ల మధ్య నమోదైంది.

ప్రభుత్వ బాండ్లలోనూ పెరుగుదల

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీల్లో బ్యాంకుల పెట్టుబడులు కూడా పెరిగాయి. గతేడాది అక్టోబరు 17 నాటికి రూ.70.53 లక్షల కోట్లుగా ఉన్న ఈ పెట్టుబడులు.. ఈ ఏడాది అక్టోబరు 15 నాటికి 9.64 శాతం వృద్ధితో రూ.77.32 లక్షల కోట్లకు చేరాయి. వీటిలో కేంద్ర ప్రభుత్వ సెక్యూరిటీల వాటా అధికంగా ఉంది.

జోరు తగ్గని జియో షేరు

- మూడు రోజుల్లో రూ.12,754 కోట్లకు పెరిగిన మార్కెట్ విలువ
- రూ.13.18 లక్షల కోట్లకు చేరిన సంస్థ విలువ



న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ అనుబంధ సంస్థ జియో ప్లాట్‌ఫామ్స్ షేరు మార్కెట్లో దూసుకెళ్తోంది. బుధవారం నమోదైనప్పటి నుంచి మూడు రోజుల్లో దాదాపు 28 శాతం లాభపడింది. శుక్రవారం బీఎస్ఈలో ఇష్యూ ధర రూ. 1,119తో పోలిస్తే 27.89 శాతం పెరిగి రూ.1,431.20 వద్ద, ఎన్ఎస్ఈలో 27.90 శాతం వృద్ధితో రూ. 1,431.30 వద్ద ముగిసింది. షేరు ధర పెరుగుదలతో సంస్థ మార్కెట్ విలువ మూడు రోజుల్లో రూ.12,754.51 కోట్లు పెరిగి రూ.13,17,996.49 కోట్లకు చేరింది. దేశంలో మార్కెట్ విలువ పరంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ తర్వాత జియో రెండో స్థానంలో ఉంది. ఇదిలాఉంటే రూ. 30,213 కోట్ల జియో ఐపీఓ 22.19 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. పబ్లిక్ ఇష్యూ, యాంకర్ పెట్టుబడులు కలిపి రూ.7.4 లక్షల కోట్లకు పైగా డిమాండ్ వచ్చింది.

బైనాన్స్‌పై సైబర్ దాడి?

- క్రిప్టో డిపాజిట్లు, విత్‌డ్రాల నిలిపివేత
- 6.3 బిలియన్ డాలర్ల లావాదేవీలపై ప్రభావం
- 20 నిమిషాల్లోనే భారీగా క్రిప్టో కరెన్సీ తరలింపు
- ఉత్తరకొరియా హ్యాకర్లపై అనుమానాలు

న్యూఢిల్లీ: ప్రపంచంలోనే అతిపెద్ద క్రిప్టో ఎక్స్ఛేంజీ బైనాన్స్‌పై సైబర్ దాడి జరిగినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంస్థ భద్రతా వ్యవస్థలోకి హ్యాకర్లు చొరబడి, ఉపసంహరణల అనుమతి ప్రక్రియను దుర్వినియోగం చేసినట్లు తెలుస్తోంది. దీంతో ముందుజాగ్రత్త చర్యగా క్రిప్టో డిపాజిట్లు, విత్‌డ్రాలను బైనాన్స్ నిలిపివేసింది. ఈ పరిణామంతో 6.3 బిలియన్ డాలర్ల లావాదేవీలపై ప్రభావం పడగా.. బిట్‌కాయిన్ సహా పలు డిజిటల్ కరెన్సీల ధరలు పడిపోయాయి. బైనాన్స్‌కు చెందిన ఓ ఉద్యోగి ల్యాప్‌టాప్‌ను హ్యాకర్లు తమ ఆధీనంలోకి తీసుకుని, సంస్థ అంతర్గత సర్వర్లలోకి చొరబడినట్లు అనుమానిస్తున్నారు. వాలెట్ల ప్రైవేట్ కీలు దొంగిలించకుండానే ఉపసంహరణల ఆమోద వ్యవస్థను దుర్వినియోగం చేసి, కేవలం 20 నిమిషాల్లో భారీ మొత్తంలో క్రిప్టోలను తరలించినట్లు సమాచారం. ఈ దాడి వెనుక ఉత్తరకొరియా ప్రభుత్వ మద్దతున్న హ్యాకర్లు ఉండవచ్చని నిపుణులు అనుమానిస్తున్నారు.



అనుమానాస్పద నిధుల నిలిపివేత

భద్రతా తనిఖీల్లో భాగంగా అనుమానాస్పద నిధులను నిలిపివేసినట్లు బైనాన్స్ వెల్లడించింది. సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టామని, వినియోగదారులకు జరిగిన నష్టాలను సంస్థే భరిస్తుందని తెలిపింది. వాలెట్ల ప్రైవేట్ కీలు లీకైనట్లు ఆధారాలు లేవని స్పష్టం చేసింది. 2017లో చాంగ్‌పెంగ్ జావో స్థాపించిన ఈ సంస్థకు 100కుపైగా దేశాల్లో 30 కోట్ల మంది నమోదిత వినియోగదారులున్నారు. తాజా ఘటనతో ఎంతమంది ప్రభావితమయ్యారన్నది ఇంకా తెలియరాలేదు.



సౌదీకి విమానాల రద్దు పొడిగింపు

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో సౌదీ అరేబియాకు విమాన సర్వీసుల రద్దును ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ నవంబరు 14 వరకు పొడిగించాయి. జెద్దా, రియాద్, దమ్మాం నగరాలకు వెళ్లే, అక్కడి నుంచి వచ్చే విమానాలు అప్పటివరకు నిలిచిపోనున్నాయి. గతంలో రియాద్, దమ్మాం సర్వీసులను నవంబరు 7 వరకు, జెద్దా విమానాలను అక్టోబరు 31 వరకు రద్దు చేశాయి. అక్టోబరు 30 లేదా అంతకుముందు టికెట్లు బుక్ చేసుకుని, నవంబరు 14 వరకు ప్రయాణించాల్సిన వారు అందుబాటును బట్టి నవంబరు 29 వరకు ఒకసారి ఉచితంగా తేదీ మార్చుకోవచ్చు. టికెట్ రద్దు చేసుకుంటే పూర్తి మొత్తం తిరిగి చెల్లిస్తారు. ఎయిరిండియా ప్రయాణికులు ఆ సంస్థ సర్వీసులున్న సౌదీ నగరాలకు, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులు సౌదీతోపాటు బహ్రెయిన్‌లోని ఆ సంస్థ గమ్యస్థానాలకు ప్రయాణాన్ని మార్చుకోవచ్చు. మరోవైపు ఇండిగో జెద్దా, దమ్మాం, మదీనా సర్వీసులను నవంబరు 14 వరకు రద్దు చేసింది. ఆకాశ ఎయిర్ రియాద్ విమానాలను నవంబరు 30 వరకు, జెద్దా సర్వీసులను నవంబరు 10 వరకు నిలిపివేసింది.

రెండో రోజూ మార్కెట్ల జోరు

- 308 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్..
- 23,053 వద్ద ముగిసిన నిఫ్టీ

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజూ లాభాలతో ముగిశాయి. ఐటీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు, ట్రెంట్ మెరుగైన త్రైమాసిక ఫలితాలు సూచీలను ముందుకు నడిపించాయి. శుక్రవారం సెన్సెక్స్ 308.49 పాయింట్లు పెరిగి 74,459.53 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 116.35 పాయింట్ల లాభంతో 23,053.10 వద్ద ముగిసింది. ఒక దశలో సెన్సెక్స్ 591 పాయింట్లకుపైగా ఎగబాకింది. వారాంతపు లెక్కల్లో సెన్సెక్స్ 1,335.7 పాయింట్లు, నిఫ్టీ 453.1 పాయింట్లు చొప్పున పెరిగాయి. సెన్సెక్స్ షేర్లలో ట్రెంట్ 5.20 శాతం లాభపడింది. సెప్టెంబరు త్రైమాసికంలో సంస్థ నికర లాభం 25 శాతం పెరిగి రూ.468 కోట్లకు చేరడం దీనికి కారణమైంది. ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్ సహా పలు షేర్లూ రాణించాయి. మరోవైపు ఎన్‌బీఐ, మహీంద్రా అండ్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, టాటా స్టీల్ నష్టపోయాయి. బీఎస్ఈ ఐటీ సూచీ 1.53 శాతం, ఫోకస్డ్ ఐటీ సూచీ 1.91 శాతం పెరిగాయి. అయితే స్మాల్‌క్యాప్ సూచీ 2.09 శాతం, మిడ్‌క్యాప్ సూచీ 0.63 శాతం పడిపోయాయి. అంతర్జాతీయంగా బ్రెంట్ ముడిచమురు ధర 2.17 శాతం పెరిగి బ్యారెల్ 117.4 డాలర్లకు చేరింది. గురువారం విదేశీ సంస్థాగత మదుపర్లు రూ.943.60 కోట్ల షేర్లను విక్రయించారు.

టెలికాం ఏఐపై ట్రాయ్ మార్గదర్శకాలు

- ప్రత్యేక విధానానికి బోర్డు ఆమోదం తప్పనిసరి
- తీవ్ర ఘటనలపై నివేదిక.. భద్రతకు ప్రత్యేక కమిటీలు
- ముసాయిదాపై నవంబరు 27లోగా అభిప్రాయాల సేకరణ

న్యూఢిల్లీ: టెలికాం నెట్‌వర్క్‌లు, సేవల్లో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగాన్ని క్రమబద్ధీకరించేందుకు ట్రాయ్ మార్గదర్శకాల ముసాయిదాను ప్రతిపాదించింది. ప్రతి టెలికాం సంస్థ డైరెక్టర్ల బోర్డు ఆమోదంతో ప్రత్యేక ఏఐ విధానాన్ని రూపొందించుకోవాలని, భద్రత, పాలనకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించింది. ఈ ముసాయిదాపై నవంబరు 27లోగా అభిప్రాయాలు తెలపాలని కోరింది. ఏఐ వ్యవస్థలను వాటి ప్రభావం ఆధారంగా అధిక, మధ్యస్థ, తక్కువ ప్రమాద



స్థాయిలుగా వర్గీకరించాలి. ఏఐ వల్ల తలెత్తే ఘటనలను నాలుగు స్థాయిలుగా విభజించి, క్రిటికల్, హై స్థాయి ఘటనలను నిర్ణీత గడువులో ట్రాయ్‌కు నివేదించాలి. వినియోగదారుల ఫిర్యాదులు, నష్టాల వివరాలతో డేటాబేస్ నిర్వహించాలి. ప్రతి సంస్థలో సీనియర్ అధికారి నేతృత్వంలో ఏఐ గవర్నెన్స్ అండ్ సేఫ్టీ కమిటీని ఏర్పాటు చేసి, వ్యవస్థల పనితీరు, భద్రతను కనీసం ఏడాదికోసారి సమీక్షించాలి. కొత్త ఏఐ వ్యవస్థల కచ్చితత్వం, పారదర్శకత, భద్రతను ముందుగానే అంచనా వేయాలి. వినియోగిస్తున్న అన్ని ఏఐ వ్యవస్థల జాబితా నిర్వహించాలి. ఇతర సంస్థల నుంచి పరిష్కారాలు పొందినా వాటి ఫలితాలకు టెలికాం సంస్థలే బాధ్యత వహించాలి. టెలిగ్రాఫ్ చట్టం–1885 లేదా టెలికమ్యూనికేషన్స్ చట్టం–2023 కింద లైసెన్స్ పొందిన, టెలికాం సేవలు, నెట్‌వర్క్‌లలో ఏఐని వినియోగిస్తున్న లేదా వినియోగించాలనుకుంటున్న సంస్థల నిర్వంటికీ ఈ మార్గదర్శకాలు వర్తించనున్నాయి.



బంగారం, వెండి ధరలు పతనం

- ఈ నెలలో అంతర్జాతీయ మార్కెట్లో బంగారం 3.5 శాతం డౌన్
- ఏకంగా 14 శాతం తగ్గిన వెండి ధర

న్యూఢిల్లీ: అంతర్జాతీయ మార్కెట్లో బంగారం, వెండి ధరలు భారీగా తగ్గుముఖం పట్టాయి. సాధారణంగా పండగలు, పెళ్లిళ్ల సీజన్‌లో పసిడికి గిరాకీ పెరిగే సమయంలో ఈసారి ధరలు దిగిరావడం గమనార్హం. ఈ నెలలో ఇప్పటివరకు అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధర 3.5 శాతం తగ్గగా.. వెండి ఏకంగా 14 శాతం పడిపోయింది. శుక్రవారం స్పాట్ గోల్డ్ ఔన్స్ ధర 0.2 శాతం తగ్గి 3,990 డాలర్ల వద్ద కొనసాగింది. వెండి ధర కూడా 0.4 శాతం క్షీణించి ఔన్స్‌కు 50.98 డాలర్లకు చేరింది. దేశీయ కమొడిటీ మార్కెట్లలోనూ ఇదే ధోరణి కనిపించింది. గోల్డ్ ఫ్యూచర్స్ 10 గ్రాముల ధర రూ.1.42 లక్షలు, సిల్వర్ ఫ్యూచర్స్ కిలో ధర రూ. 1.87 లక్షల వద్ద నమోదయ్యాయి.

హైదరాబాద్ మార్కెట్లో ఉదయం సమయానికి 24 క్యారెట్ల మేలిమి బంగారం 10 గ్రాముల ధర రూ.1.45 లక్షలుగా ఉంది. కిలో వెండి ధర రూ.1.89 లక్షలకు దిగొచ్చింది. క్రితం రోజుతో పోలిస్తే ఒక్కరోజులోనే వెండి ధర దాదాపు రూ.5 వేలు తగ్గింది. అంతర్జాతీయంగా కొనసాగుతున్న ధరల పతనం దేశీయ మార్కెట్లపైనా ప్రభావం చూపుతోంది.



రేసింగ్ ట్రాక్‌పై అజిత్ పోరాటం..

తమిళ స్టార్ హీరో అజిత్ కుమార్ వెండితెరపైనే కాదు.. నిజజీవితంలోనూ తన వేగంతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. సినిమాల్లో మాస్ హీరోగా ప్రేక్షకులను అలరిస్తూనే, మరోవైపు అంతర్జాతీయ రేసింగ్ ట్రాక్‌లపై ప్రొఫెషనల్ రేసర్‌గా సత్తా చాటుతున్నారు. ఈ క్రమంలో ఆయన రేసింగ్ ప్రయాణం, దాని వెనుక ఉన్న కష్టాలు, కన్నీళ్లు, విజయాలు, భావోద్వేగాలను ప్రేక్షకులకు పరిచయం చేసేందుకు 'గ్లాడియేటర్స్' పేరుతో ఓ ప్రత్యేక డాక్యుమెంటరీ రూపొందుతోంది. ప్రముఖ దర్శకుడు ఏఎల్ విజయ్ దీనికి దర్శకత్వం వహిస్తుండగా, అజిత్ భార్య షాలిని తన సొంత నిర్మాణ సంస్థ గోల్డెన్ ట్రోఫీ ఫిల్మ్ ప్రొడక్షన్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. తొలుత ఈ చిత్రాన్ని నవంబర్ 19న విడుదల చేయాలని భావించినప్పటికీ, కొన్ని కారణాలతో వాయిదా పడింది. తాజాగా వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా జనవరిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో ప్రచారమవుతున్న పోస్టులు అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. మరోవైపు ఈ



డాక్యుమెంటరీకి సంబంధించి ఇటీవల 25 నిమిషాల ఫుటేజ్‌ను వీక్షించిన యువ దర్శకుడు ఆధిక్ రవిచంద్రన్ ఆసక్తికర విషయాలను వెల్లడించారు. సినిమాలోని సన్నివేశాలు, సంగీతం, భావోద్వేగాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటాయని ప్రశంసించారు. జి.వి. ప్రకాష్ అందించిన నేపథ్య సంగీతం, పాటలు థియేటర్లలో ప్రత్యేక అనుభూతిని కలిగిస్తాయని, ముఖ్యంగా అనిరుధ్ ఆలపించిన ఓ పాట ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇంటర్వెల్ సన్నివేశం, టైటిల్ కార్డు తెరపై కనిపించే విధానం ఊహించని స్థాయిలో ఉంటాయని వెల్లడించారు. అజిత్ కుటుంబం, పిల్లలతో అయనకు సంబంధించిన సన్నివేశాల్లో భావోద్వేగాలు అద్భుతంగా పండాయని తెలిపారు. మరోవైపు తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఈ డాక్యుమెంటరీలో అతిథి పాత్రలో కనిపించనున్నారంటూ వస్తున్న ప్రచారంపైనా ఆధిక్ స్పందించారు. ఆ సన్నివేశాలను తాను పూర్తిగా చూడలేదని, అందువల్ల వాటిపై ఇప్పుడే ఏమీ చెప్పలేనని స్పష్టం చేశారు. ఈ చిత్రాన్ని థియేటర్లలో పూర్తిగా వీక్షించేందుకు తాను కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని పేర్కొన్నారు. మొత్తానికి అజిత్ సినీ ప్రయాణంతో పాటు రేసింగ్ ప్రపంచంలోని సాహసాలు, సవాళ్లు, కుటుంబ అనుబంధాలను ఆవిష్కరించనున్న 'గ్లాడియేటర్స్' డాక్యుమెంటరీ కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు.


విమర్శలు కాదు..
నటనే ముఖ్యం

అందం, రూపురేఖలపై వచ్చే విమర్శల కంటే తనకు నటనే ముఖ్యమని ప్రముఖ కథానాయిక తమన్నా స్పష్టం చేశారు. గతంలో సీనియర్ నటుడు అన్నూ కపూర్ ఓ చర్చా కార్యక్రమంలో తమన్నా గురించి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు అప్పట్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ముఖ్యంగా 'స్త్రీ–2' చిత్రంలోని 'ఆజ్ కీ రాత్' పాటలో ఆమె కనిపించిన తీరును ప్రస్తావిస్తూ, చర్మపు రంగుపై అన్నూ కపూర్ చేసిన వ్యాఖ్యలు విమర్శలకు కారణమయ్యాయి. తమన్నా పాలవంటి శరీరంతో పిల్లలకు జోలపాట పాడుతుందంటూ ఆయన చేసిన వ్యాఖ్యలపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. తాజాగా ఈ వివాదాన్ని పక్కనపెట్టి, తన వ్యక్తిగత రూపురేఖలపై వచ్చే విమర్శలను ఎలా స్వీకరిస్తారనే విషయంపై తమన్నా స్పందించారు. ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. ఒక కళాకారిణిగా ఇతరులు చెప్పే అభిప్రాయాలను వినడం ఎంత ముఖ్యమో, వాటిలో దేనిని స్వీకరించాలి, దేనిని పట్టించుకోకుండా వదిలేయాలనే విషయాన్ని గుర్తించడం కూడా అంతే ముఖ్యమని అన్నారు. ముఖ్యంగా మహిళలు తమ రూపం, అందం, వ్యక్తిగత విషయాలపై వచ్చే ప్రతి చిన్న వ్యాఖ్యకు ప్రాధాన్యత ఇస్తూ ఉంటే జీవితంలో ముందుకు సాగలేరని అభిప్రాయపడ్డారు. అందుకే తనపై వచ్చే అనవసరమైన విమర్శలను అసలు పట్టించుకోనని, వాటిని చదవడానికి, వాటిపై స్పందించడానికి సమయం కేటాయించనని స్పష్టం చేశారు. తన దృష్టి ఎప్పుడూ నటనపైనే ఉంటుందని, తాను ఎలాంటి కథల్లో నటించాలి, ఎలాంటి పాత్రలు చేయాలి, ప్రేక్షకులకు కొత్తగా ఏమి అందించాలనే విషయాలకే ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. ఒక కళాకారిణిగా తనకు వచ్చే ప్రశంసలతో పాటు విమర్శలను కూడా స్వీకరించాల్సి ఉంటుందని, అయితే ప్రతి విమర్శను మనసుకు తీసుకోవాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. నటనను కేవలం వృత్తిగా కాకుండా ఒక సేవగా భావిస్తానని, ప్రతి చిత్రానికి పూర్తి నిజాయితీతో, అంకితభావంతో పనిచేస్తానని తమన్నా వెల్లడించారు. తాను చేసే పనిపట్ల చూపించే ఈ నిబద్ధతే ప్రేక్షకులకు తన నటనను మరింత చేరువ చేస్తోందని అభిప్రాయ పడ్డారు. అందం గురించి మాట్లా డేవారి కంటే తన నటనను గుర్తించే ప్రేక్షకులే తనకు ముఖ్యమని ఆమె మాటలు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుతం తమన్నా చేసిన ఈ వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

ట్రోలింగ్‌పై త్రివిక్రమ్ క్లారిటీ

మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్, విక్టరీ వెంకటేష్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం' చుట్టూ తాజాగా ఓ ఆసక్తికర వివాదం నడుస్తోంది. అక్టోబర్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో జరిగిన ఓ ఘటన సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది. వేదికపై హీరోయిన్ శ్రీనిధి శెట్టికి త్రివిక్రమ్ పాదాభివందనం చేసేందుకు ప్రయత్నించడం అందరి దృష్టిని ఆకర్షించింది. తనకంటే వయసులో చిన్నదైన హీరోయిన్‌కు స్టార్ దర్శకుడు అలా నమస్కరించేందుకు ప్రయత్నించడం ఏమిటంటూ కొందరు నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేయగా, మరికొందరు ట్రోలింగ్‌కు దిగారు. ఈ వ్యవహారం కాస్త వైరల్‌గా మారడంతో తాజాగా త్రివిక్రమ్ దీనిపై స్పందించి అసలు విషయం వెల్లడించారు. శ్రీనిధి శెట్టితో తనకు ఉన్న ప్రత్యేకమైన స్నేహం, చనువు కారణంగానే అలా సరదాగా ప్రవర్తించానని స్పష్టం చేశారు. ఇప్పటివరకు తాను పనిచేసిన కథానాయికల్లో శ్రీనిధి తమ కుటుంబానికి ఎంతో దగ్గరైన వ్యక్తి అని తెలిపారు. షూటింగ్ సమయంలో అందరితో కలిసిపోయే స్వభావం, ఆత్మీయతతో ఆమె తమ ఇంటి మనిషిలా మారిపోయిందని పేర్కొన్నారు. ఇద్దరి మధ్య మంచి స్నేహం ఉన్నప్పుడు ఒకరినొకరు ఆటపట్టించుకోవడం సహజమని, అదే చనువుతో పాదాలకు నమస్కరిస్తున్నట్లు సరదాగా నటించానని వివరించారు.

స్టార్ ట్రెక్ దిగ్గజం సర్ పాట్రిక్ స్టువర్ట్ కన్నుమూత



ప్రపంచ సినీ ప్రేక్షకులను తన అద్భుత నటనతో అలరించిన ప్రముఖ హాలీవుడ్ నటుడు సర్ పాట్రిక్ స్టువర్ట్ (86) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన అల్జీమర్స్, లూయీ బాడీ డిమెన్షియా వ్యాధులతో పోరాడుతూ తుదిశ్వాస విడిచారు. లాస్ ఏంజిల్స్‌లోని తన నివాసంలో బుధవారం ఆయన మరణించినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. భార్య సన్నీ ఒజెల్ సమక్షంలో ప్రశాంతంగా కన్నుమూసినట్లు తెలిపారు. చివరి క్షణాల్లో కుటుంబ సభ్యులు, ఆత్మీయులు ఆయన పక్కనే ఉన్నారని, సంగీతం, ప్రార్థనలు, నవ్వులు, కన్నీళ్ల మధ్య ఆయనకు వీడ్కోలు పలికామని సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. బ్రిటన్‌కు చెందిన పాట్రిక్ స్టువర్ట్ 'స్టార్ ట్రెక్: ది నెక్ట్స్ జనరేషన్'లో కెప్టెన్ జీన్ లూక్ పికార్డ్ పాత్రతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు. అలాగే 'ఎక్స్–మెన్' చిత్రాల్లో ప్రొఫెసర్ చార్లెస్ జేవియర్‌గా నటించి ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేశారు. రంగస్థలం నుంచి వెండితెర వరకు విభిన్న పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. చలనచిత్ర రంగానికి ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా 2010లో అప్పటి బ్రిటన్ రాణి ఎలిజబెత్–2 చేతుల మీదుగా నైట్‌హుడ్ గౌరవాన్ని అందుకున్నారు. ఆయన మరణవార్తతో హాలీవుడ్ చిత్ర పరిశ్రమలో విషాదం నెలకొంది. మార్వెల్ స్టూడియోస్‌తో పాటు పలువురు ప్రముఖ నటులు, ప్రపంచవ్యాప్తంగా అభిమానులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఆయన ప్రొఫెసర్ జేవియర్‌గా చివరిసారిగా నటించిన 'అవెంజర్స్: డూమ్స్‌డే' చిత్రం డిసెంబరులో ప్రేక్షకుల ముందుకు రానుంది.

పరిణితకు తెలుగు చిత్ర పరిశ్రమలో ప్రత్యేక స్థానం

చిన్నారి పరిణిత రుద్రరాజు ప్రతిభకు తెలుగు చిత్ర పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు లభించబోతోందని ప్రముఖ రచయిత, దర్శకుడు వి. విజయేంద్ర ప్రసాద్ అన్నారు. వెన్నెల సిల్వర్ స్క్రీన్ పతాకంపై దీపక్ నిర్మాణంలో శరత్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'డ్యాడ్స్ లిటిల్ ఫ్రెండ్'. రజత్ రాఘవ్, కాజల్, హాసిని సుధీర్ హీరోహీరోయిన్లుగా నటిస్తుండగా, బేబీ పరిణిత రుద్రరాజు కీలక పాత్ర పోషిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ రచయిత, దర్శకుడు వి. విజయేంద్ర ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై టీజర్‌ను ఆవిష్కరించారు. తెలుగు సినిమా చరిత్రలో పరిణితకు ప్రత్యేకంగా ఓ పేజీ ఉండబో తోందని ప్రశంసించారు. దర్శకుడు శరత్ ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించి ఉంటారని ఆశిస్తున్నానని, రజత్ రాఘవ్‌కు ఈ సినిమా మంచి పేరు, డబ్బుతో పాటు కెరీర్‌లో గొప్ప గుర్తింపును తీసుకురావాలని ఆకాంక్షించారు. 'డ్యాడ్స్ లిటిల్ ఫ్రెండ్' ఘన విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. విజయేంద్ర ప్రసాద్ వంటి ప్రముఖ సినీ రచయిత ఈ చిత్ర టీజర్ విడుదల కార్యక్రమానికి హాజరై చిన్నారి పరిణిత ప్రతిభను ప్రశంసించడంతో సినిమాపై ఆసక్తి నెలకొంది.

డెస్టినీ లవ్ సాంగ్ విడుదల

యువతను ఆకట్టుకునే ప్రేమకథా చిత్రంగా తెరకెక్కుతున్న 'డెస్టినీ' నుంచి మరో ఆసక్తికరమైన అప్‌డేట్ వచ్చింది. కె. రాఘవేంద్రరెడ్డి సమర్పణలో కుర్ర ప్రొడక్షన్స్ పతాకంపై దినేష్ కుర్ర నిర్మిస్తున్న ఈ చిత్రానికి చెందు ముద్దు దర్శకత్వం వహిస్తున్నారు. జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్, శ్రీ సత్య జంటగా నటిస్తుండగా, ఆమని, రవి ప్రకాష్, కిరీటి, శివ కోట్ల తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి 'ఇద్దరి గుండెలపైన' అంటూ సాగే యూత్‌ఫుల్ లవ్ సాంగ్‌ను ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి విడుదల చేశారు. పాట వినసొంపుగా ఉండటంతో పాటు సినిమా నేపథ్యం, కథాంశం కూడా ఆసక్తికరంగా ఉన్నాయని ఆయన ప్రశంసించారు. ఇమ్మాన్యుయేల్ తనకు ఎంతో సన్నిహితుడని పేర్కొంటూ, అతడితో పాటు చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. మారుతి రాజా స్వరాలు సమకూర్చిన ఈ పాటకు శ్రీరామ్ తపస్వి సాహిత్యం అందిం చగా, సాయి చరణ్ భాస్కరుణి, అభిజ్ఞ తనికెళ్ల తమ గాత్రంతో అందంగా ఆలపించారు. ప్రేమలోని మధురమైన భావోద్వేగాలను ప్రతిబింబించేలా రూపొందిన ఈ పాట యువతను ఆకట్టుకునేలా ఉంది.



ఇప్పటికే ఈ సినిమా నుంచి ప్రముఖ దర్శకురాలు నందినీ రెడ్డి విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌కు మంచి స్పం దన లభించింది. ఇప్పుడు అనిల్ రావిపూడి చేతుల మీదుగా పాట విడుదల కావడంతో సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది. విభిన్నమైన పాత్రలతో గుర్తింపు తెచ్చుకుం టున్న ఇమ్మాన్యుయేల్, శ్రీ సత్య జంటగా నటిస్తున్న ఈ ప్రేమకథా చిత్రం ప్రేక్షకులను ఏ మేరకు అలరిస్తుం దో చూడాలి. త్వరలోనే సినిమా విడుదల తేదీతో పాటు ఇతర వివరాలను చిత్ర బృందం వెల్లడించనుంది.

మహిళా నిర్మాతలకు
మంచి భవిష్యత్తు ఉంది



మహిళా నిర్మాతలు చిత్ర పరిశ్రమలో తమ కంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారని, కొత్తగా పరిశ్రమలోకి అడుగుపెడుతున్న వారు మరిన్ని విజయాలు సాధించాలని ప్రముఖ నటుడు, నిర్మాత, ఏపీ శాసనమండలి సభ్యుడు నాగబాబు ఆకాంక్షించారు. హన్సి ప్రొడక్షన్స్ పతాకంపై ప్రొడక్షన్ నంబర్ 1గా శ్రీ హన్సిక పెద్దిరెడ్డి నిర్మిస్తున్న చిత్రం 'మైలురాయి'. తవిటిరాజు తలచింతల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి ప్రతిభావంతుడైన దర్శకుడు రఘువర్ధన్ కోట్ల దర్శకత్వం వహిస్తున్నారు. యువ నటీనటులు జగన్ యోగిరాజు, నవ్య చిట్యాల హీరోహీరోయిన్లుగా నటిస్తుండగా, సీనియర్ నటుడు దేవీ ప్రసాద్ కీలక పాత్ర పోషిస్తున్నారు. తాజాగా ఈ చిత్ర టైటిల్ లాంచ్ పోస్టర్‌ను నాగబాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'మైలురాయి' అనే టైటిల్ ఎంతో ఆసక్తికరంగా ఉందని అన్నారు. నిర్మాత హన్సిక తన సినీ ప్రయాణాన్ని మంచి చిత్రంతో ప్రారంభించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఔత్సాహిక దర్శకుడు, యువ కథానాయకుడితో సినిమా నిర్మించేందుకు ముందుకు రావడం సంతోషకరమన్నారు. చిత్ర నిర్మాణంలో మహిళలకు ఉండే బాధ్యత, క్రమశిక్షణ ఎంతో గొప్పవని కొనియాడారు. ఇప్పటికే అశ్వనీదత్ కుమార్తెలు స్వప్నదత్, ప్రియాంకదత్, తన కుమార్తె నిహారిక, సుప్రియ యార్లగడ్డ వంటి వారు చిత్ర పరిశ్రమలో నిర్మాతలుగా, సినీ ప్రముఖులుగా మంచి గుర్తింపు సంపాదించుకున్నారని గుర్తుచేశారు. అదే బాటలో హన్సిక కూడా పయనిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు. 'మైలురాయి' చిత్రంతో ఆమెకు మంచి పేరు రావాలని కోరుకుంటూ, దర్శకుడు రఘువర్ధన్ కోట్లతో పాటు నటీనటులు, సాంకేతిక నిపుణులు, చిత్రబృందంలోని ప్రతి ఒక్కరికీ నాగబాబు శుభాకాంక్షలు తెలిపారు.

ముచ్చటగా మూడోసారి..
అక్షయ్‌తో భూమి జోడీ

విలక్షణమైన కథలు, వైవిధ్యమైన పాత్రలతో బాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కథానాయిక భూమి పెడ్నేకర్ ఖాతాలో మరో క్రేజీ ప్రాజెక్ట్ చేరింది. బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్‌తో ఆమె మరోసారి జోడీ కట్టనున్నారు. ప్రముఖ దర్శకుడు ప్రియదర్శన్ తెరకెక్కించనున్న కొత్త చిత్రంలో భూమి పెడ్నేకర్‌ను కథానాయికగా ఎంపిక చేసినట్లు దర్శకుడు స్వయంగా వెల్లడించారు. దీంతో అక్షయ్ కుమార్, భూమి పెడ్నేకర్ జంట ముచ్చటగా మూడోసారి వెండితెరపై సందడి చేయనుంది. గతంలో వీరిద్దరూ కలిసి నటించిన చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో తాజా కాంబినేషన్‌పై ఆసక్తి నెలకొంది. 2017లో విడుదలైన 'టాయిలెట్: ఏక్ ప్రేమ్ కథ'లో అక్షయ్‌కు జోడీగా నటించిన భూమి సహజసిద్ధమైన అభినయంతో ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకోవడంతో వీరిద్దరి జోడీకి ప్రత్యేక గుర్తింపు లభించింది. అనంతరం 2022లో విడుదలైన 'రక్షా బంధన్' చిత్రంలోనూ కలిసి నటించారు. ఇప్పుడు మరోసారి అక్షయ్‌తో జతకడుతుండటం, అందులోనూ 'హేరా ఫేరీ', 'భూల్ భులయ్యా' వంటి విజయవంతమైన చిత్రాలతో గుర్తింపు పొందిన ప్రియదర్శన్ దర్శకత్వంలో నటించే అవకాశం రావడంతో ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు పెరుగుతున్నాయి. మరోవైపు భూమి పెడ్నేకర్ కెరీర్ పరంగా విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఇటీవల ప్రైమ్ వీడియోలో విడుదలైన 'దల్దల్' వెబ్ సిరీస్‌లో ఏసీపీ రీటా ఫరియా పాత్రలో ఆమె చూపించిన నటన విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ప్రతి చిత్రంలోనూ కొత్తదనం చూపించేందుకు ప్రయత్నిస్తున్న భూమి, ఇప్పుడు అక్షయ్ కుమార్‌తో కలిసి మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రియదర్శన్ దర్శకత్వ ప్రతిభ, అక్షయ్ కామెడీ టైమింగ్, భూమి నటన కలిస్తే ఈ చిత్రం ఎలాంటి వినోదాన్ని అందిస్తుందోనన్న ఆసక్తి బాలీవుడ్ వర్గాల్లో నెలకొంది.



Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. **Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187**, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.